ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
శనివారం 8-08-2026 పేజీలు : 16

## దామయాపల్లి ఇంటి చోరీ కేసు ఛేదించిన పోలీసులు



**- 3 గురు అరెస్ట్, 25 తులాల వెండి రికవరీ..**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, కోయిలకొండ, విజన్ ఆంధ్ర,ఆగస్టు 07: మహబూబ్‌నగర్ జిల్లా దామయాపల్లి గ్రామంలో గత నెల 23వ తేదీన జరిగిన ఇంటి చోరీ కేసును కోయిలకొండ పోలీసులు సక్సెస్ ఫుల్ గా ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

17 పేజీలో...

## ఆరుతడి పంటల సాగుపై

# రైతులు దృష్టి సారించాలి

**- రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

నిజామాబాద్, ఆగస్టు 07 :( విజన్ ఆంధ్ర ) : ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు తక్కువ నీటి అవసరంతో ఎక్కువ దిగుబడి వచ్చే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వానాకాలం సాగు, వన మహోత్సవం, పంట కుంటలు, స్మార్ట్ రేషన్ కార్డుల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో ప్రభావంతో లోటు



వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతులు వరి మినహా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలు సాగు చేసే విధంగా

14 పేజీలో...

## లడ్డూతో నమ్మకం గెలుచుకుని రూ. 3.45 కోట్ల మోసం

**- మైహోం భుజలో గణేష్ ఉత్సవాల లడ్డూను రూ. 51 లక్షలకు కొని పెట్టుబడుల పేరుతో వంచన...**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్టు 07: గణేష్ ఉత్సవాల సందర్భంగా లడ్డూ వేలంలో రూ. 51 లక్షలు వెచ్చించి అందరి దృష్టిని ఆకర్షించిన ఓ వ్యక్తి, ఆ నమ్మకాన్నే ఆయుధంగా చేసుకుని కోట్ల రూపాయల మోసానికి పాల్పడిన ఘటన మైహోం భుజలో వెలుగులోకి వచ్చింది.

17 పేజీలో...

## అర్బన్ అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అందజేత

**- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**

నిజామాబాద్ ఆగస్టు07: (విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలోని పలు రోడ్లు, వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి శుక్రవారం కేంద్ర రోడ్డు మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని దేవీ రోడ్డు, రైల్వే స్టేషన్, నాందేవాడ అదనపు వంతెన ( ఆర్ వో బీ ) మంజూరుచేయాలని కోరడం జరిగిందన్నారు. అలాగే సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎల్లమ్మ గుట్ట వద్ద ఆర్ యూబీ ఏర్పాటు చేయడం అత్యంత



ఆవశ్యకమన్నారు. ఇందుకోసం రెండింటికి రూ. 170 కోట్లు మంజూరుకావాలన్నారు. అలాగే నిజామాబాదులోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి పాత జిపి ఆఫీస్ వరకు రూ. 30 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్డు కోసం ప్రతిపాదించడం జరిగిందన్నారు. వర్ని జంక్షన్ నుంచి నిజామాబాద్, డిచ్పల్లి, ఇందల్వాయి, భీమ్గల్ మీదుగా కమ్మర్పల్లి వరకు నగరాన్ని కలుపుతూ 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనను కూడా అందజేశామన్నారు. మరొక రోడ్డు నగరంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం, దుబ్బ మీదుగా కాలూర్ రోడ్డు ను పూర్తి చేయాలని కోరడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ పాటిల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఉన్నారు.

## కూచనపల్లి – మాలపల్లి వంతెనకు రూ.3 కోట్ల నిధులు..



మడప పద్మ జైపాల్ రెడ్డి కూచనపల్లి గ్రామ సర్పంచ్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగస్టు7 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచనపల్లి,మాలపల్లి గ్రామాల మధ్య వాగుపై వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పాటు బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమానాలు మంజూరు చేయించడంలో గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి.

10 పేజీలో...



## కోర్టులో కేసు పెండింగ్ ఉండగా పనులు చేయడం సరి కాదు

### -సర్వేనెంబర్ 52 జిపిఏ హోల్డర్ నయీమ్ ఖాన్

తాండూరు, ఆగస్టు 7(విజన్ ఆంధ్ర): జిల్లా కోర్టులో కేసు పెండింగ్ ఉండగా వివాదాస్పద స్థలంలో విద్యుత్ అధికారులు పనులు చేపట్టడం సరి కాదని సర్వే నెంబర్ 52 జిపిఏ హోల్డర్ నయీమ్ ఖాన్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సర్వేనెంబర్ 52 స్థలం సంబంధించి ఓఎస్ 102,19 కేసు ఫస్ట్ అడిషనల్ జడ్జి వికారాబాద్ కోర్టులో స్పెషల్ సేషన్ జడ్జి కోర్టు లో ఈనెల 13న కేసు ఉన్నట్లు తెలిపారు. జిల్లా కోర్టులో కేసు పెండింగ్ ఉండగా కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా సర్వే నంబర్ 52 స్థలం లో కోర్టు ఆదేశాలను ధిక్కరించి రాజకీయ ప్రూద్బలంతో ఎలాంటి అనుమతి లేకుండా అధికారులు డిఈ కార్యాలయాన్ని నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. అట్టి స్థలంలో మరోసారి జెసిబి తో చదను పనులు చేపట్టడం న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించడం అవుతుందని తక్షణమే అధికారులు స్పందించి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించడం పై న్యాయస్థానంలో అట్టి వ్యక్తులపై మరోసారి కేసు ఫైల్ చేయనున్నట్లు తెలిపారు.

## సిద్ధిపేట జిల్లా టీఐసీసీఐ సమన్వయకర్తగా భూక్యా బిక్షపతి

నంగునూరు మండలం ఆగస్టు 07 విజన్ ఆంధ్ర : గిరిజన పారిశ్రామిక, వ్యాపారవేత్తలను ప్రోత్సహించే ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(టీఐసీసీఐ) తెలంగాణ విభాగం సిద్దిపేట జిల్లా సమన్వయకర్తగా నంగునూరు మండలం జేపీ తండాకు చెందిన భూక్యా బిక్షపతి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ తెలంగాణ విభాగం అధ్యక్షుడు డా. శ్రీనివాస నాయక్ ధరావత్ శుక్రవారం నియామక పత్రం జారీ చేశారు. జిల్లాలోని గిరిజన యువతలో వ్యాపార, పారిశ్రామిక రంగాలపై ఆసక్తిని పెంపొందించడం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడం, ప్రభుత్వ పథకాలు, రుణ సదుపాయాలు, మార్కెట్ అవకాశాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను ఆయన చేపట్టనున్నారు. గిరిజన వ్యాపారవేత్తలకు అవసరమైన సహకారం అందిస్తూ వారి వ్యాపార అభివృద్ధికి తోడ్పడనున్నారు.

ఈ సందర్భంగా టీఐసీసీఐ తెలంగాణ విభాగం అధ్యక్షులు డా. శ్రీనివాస్ నాయక్ ధరావత్ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు టీఐసీసీఐ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. గిరిజన యువతలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకునేలా మార్గనిర్దేశం చేస్తామని పేర్కొన్నారు. బుక్యా బిక్షపతి నాయకత్వంలో సిద్దిపేట జిల్లాలో టీఐసీసీఐ కార్యకలాపాలు మరింత విస్తరించి, గిరిజన



పారిశ్రామికవేత్తలకు అండగా నిలుస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోని గిరిజన యువత వ్యాపార రంగంలో ముందుకు వచ్చి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా కృషి చేస్తామని తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ఆరుతడి పంటలను సాగు చేయాలి

### -- మండల వ్యవసాయ అధికారి రాము

మార్కుక్ ఆగస్టు 06,(విజన్ఆంధ్ర) : మర్కుక్ మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో గురువారం నాడు మండల వ్యవసాయ అధికారి బోయినపల్లి రాము,వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణు రైతులతో కలిసి కంది పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి పంటకు బదులుగా కంది,పెసరు,మినుము,జొన్న,సజ్జ,మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని సూచించారు.అలాగే కంది పంటలో ప్రారంభ దశలో కలుపు నివారణ,సమతుల్య ఎరువుల వినియోగం,పురుగు,తెగుళ్లను ఎప్పటికప్పుడు గమనించి వ్యవసాయ శాఖ అధికారుల సూచనల



మేరకు నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు వివరించారు.వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు,స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు బూడిద మాణిక్యం,యాదగిరి తదితరులున్నారు.

## పేరుకేనా మహిళ వార్డుసభ్యులు...??

- పతులదే హవానా.....??
- సతుల స్థానంలో పతులు ఆసీనం....
- పాలకవర్గ సమావేశంలోను పతులదే హవా..!
- పలువురు మహిళ వార్డుసభ్యుల స్థానంలో వారి భర్తల హాజరు
- ప్రభుత్వ నిబంధనలు తుంగలో.
- పలుమార్లు వార్త కథనాల్లో వచ్చిన తీరు మారని వైనం.
- సర్పంచ్,అధికారుల తీరుపై స్థానిక ప్రజల ఆగ్రహం

నందిగామ:ఆగస్టు 07(విజన్ ఆంధ్ర న్యూస్); ఏ మిట్టింగ్ జరిగిన ఏమున్నది గర్వ కారణమని, సతుల స్థానంలో పతులు ప్రత్యక్షం కావడం అన్వహితిగా మరిందంటూ స్థానిక ప్రజల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.మహిళలు ప్రజాపాలనలో భాగస్వాములు కావాలని రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ఆశయం క్షేత్రస్థాయిలో అభాసుపాలవుతోంది.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి, వారిని స్వతంత్ర శక్తులుగా తీర్చిదిద్దాలని భావించాయి.కానీ నందిగామ గ్రామ పంచాయతీలో మాత్రం మహిళా వార్డు సభ్యుల ఉనికి కేవలం రికార్డులకే పరిమితమైంది. ప్రభుత్వం మహిళలకు రిజర్వేషన్ కల్పించినప్పటికి మహిళలను వంటిటికి పరిమతం చేస్తూ సతుల స్థానంలో పతులు హాజరవుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం మండల కేంద్రమైన నందిగామ గ్రామపంచాయతీలో శుక్రవారం నిర్వహించిన పంచాయతీ పాలకవర్గ సమావేశం ఇందుకు సజీవ సాక్ష్యంగా నిలిచింది.ఎన్నికల్లో గెలిచింది మహిళా వార్డు సభ్యులైతే... సభకు హాజరై, కుర్చీలు అలంకరించి,నిర్ణయాలు తీసుకుంటున్నది మాత్రం వారి 'పతిదేవుళ్లే' కావడం గమనార్హం.వారి స్థానంలో భర్తలు వచ్చి వీరవిహారం చేస్తుంటే,ప్రభుత్వ ఆశయాలు తుంగలో తొక్కుడుకు గురవుతున్నాయని సామాజిక విశ్లేషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతే కాక ప్రభుత్వ కార్యక్రమాలలో సైతం వారే పాల్గొనడం,అధికారిక సమావేశాలలో పాల్గొని స్వాంత నిర్ణయాలు తీసుకోవడం,లాంటి కార్యక్రమాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.శుక్రవారం జరిగిన సమావేశంలో పలువురు మహిళ వార్డుసభ్యుల స్థానంలో వారి పతులు ప్రత్యక్షం కావడం విశేషం.గతంలో జరిగిన సమావేశాలకు సైతం ఇదే తంతు జరుగగా,పలు వార్త పత్రికలల్లో కథనాలు వచ్చినప్పటికీ ఎలాంటి మార్పు రాకపోవడంతో ఈ 'భర్తల రాజ్యం'తీరుపై,స్థానిక సర్పంచ్, అధికారుల తీరుపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

## థాయ్‌లాండ్‌లో తెలంగాణ టైక్వాండో క్రీడాకారుల సత్తా

### భారత్‌కు మూడు పతకాలు..

### బెల్లంపల్లిలో ఘన విజయోత్సవ ఊరేగింపు

బెల్లంపల్లి, ఆగస్టు 7 విజన్ ఆంధ్ర థాయ్‌లాండ్ దేశంలోని పటాయా సిటీలో జూలై 31 నుంచి ఆగస్టు 4 వరకు వరల్డ్ టైక్వాండో ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ హీరోస్ ఇంటర్నేషనల్ టైక్వాండో ఛాంపియన్‌షిప్లో భారత జట్టు తరపున పాల్గొన్న తెలంగాణకు చెందిన టైక్వాండో క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి మూడు పతకాలు సాధించారు. అంతర్జాతీయ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తూ దేశానికి, రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావడం పట్ల క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రమోద్ కుమార్ ప్రధాన్ సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకోగా, లాస్య దలాయ్, గోగర్ల శ్రీనిత్ సాయి తలో బ్రాంజ్ మెడల్ సాధించి భారత జట్టుకు మొత్తం మూడు పతకాలు అందించారు. ఈ విజయాలతో తెలంగాణ టైక్వాండో క్రీడాకారుల ప్రతిభ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో చాటుకుందని తెలంగాణ రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్ మాస్టర్ జిల్లపల్లి వెంకటస్వామి తెలిపారు.

ఈ విజేతలకు శిక్షణ అందించిన కోచ్ జంగపల్లి అజయ్ సేవలను తెలంగాణ రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు మూట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కురువ శ్రీహరి, ట్రెజర్ సంతోష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు బుచ్చి రామారావు, కార్యదర్శి జిల్లపల్లి వెంకటస్వామి, ప్రత్యేకంగా అభినందించారు.

భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించి దేశానికి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

థాయ్‌లాండ్‌లో విజయకేతనం ఎగురవేసి స్వదేశానికి చేరుకున్న క్రీడాకారులకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ఘన స్వాగతం పలికారు. భాజాభజంత్రీలు, బాణసంచా కాలుస్తూ, పూలమాలలతో సత్కరిస్తూ భారీ విజయోత్సవ ఊరేగింపును నిర్వహించారు. క్రీడాకారులను అభినందించేందుకు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు, టైక్వాండో శిక్షకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు సాధించిన ఈ విజయం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం, క్రీడా సంఘాలు మరింత ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో ప్రపంచస్థాయిలో మరిన్ని విజయాలు సాధించే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

## హరిత లక్ష్యానికి వెల్ ప్రకృతి చేయూత



చేవెళ్ల, ఆగస్టు 07 (విజన్ ఆంధ్ర): పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం, భావితరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వెల్ ప్రకృతి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని 14 గ్రామాల్లో మహిళలు, రైతులు, రెండు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొత్తం 1,305 మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించవచ్చని వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెద్ద చెట్లుగా పెంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ పవన్ కుమార్, మండల కో.ఆర్డినేటర్ రమేష్, నర్సరీ ఇన్‌చార్జి దామోదర్, ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వర్షపు నీటి సంరక్షణకు ఫార్మ్ పాండ్లు..

**- వన మహోత్సవంలో మొక్కల పంపిణీ**

చేవెళ్ల, ఆగస్టు 07 (విజన్ ఆంధ్ర): మండలంలోని రైతులు వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న ఫార్మ్? పాండ్ల ఏర్పాటు, వనమహోత్సవం - 2026లో భాగంగా మొక్కల పంపిణీ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారులు సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పంటలకు అవసరమైన నీటి నిల్వ కోసం రైతుల పొలాల్లో ఫార్మ్? పాండ్ల ఏర్పాటుకు వ్యవసాయ శాఖ తరపున అవకాశం కల్పించనున్నట్లు చేవెళ్ల మండల పరిధి ఖానాపూర్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి గాయత్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఫార్మ్ పాండ్లను సాధారణంగా 20 మీటర్లు x 20 మీటర్లు, మూడు మీటర్ల లోతుతో ఏర్పాటు చేస్తారని, అయితే భూమి స్వభావం, శాఖ మార్గదర్శకాల మేరకు పరిమాణాల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని తెలిపారు. సొంత వ్యవసాయ భూమి కలిగి పథక నిబంధనలకు అనుగుణంగా అర్హత పొందిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, అవసరమైతే ఉపాధి హామీ జాబ్ కార్డు, మొబైల్ నంబర్ తో తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా సమీప వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అదే సందర్భంగా వనమహోత్సవం - 2026లో భాగంగా చేవెళ్ల మండలంలోని వివిధ గ్రామాల నర్సరీల్లో మామిడి, జామ, వేప, నిమ్మ, టేకు తదితర మొక్కలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మొక్కలు అవసరమైన రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డుతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించి తమకు అవసరమైన మొక్కల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించింది. ఫార్మ్ పాండ్ల ఏర్పాటుతో వర్షపు నీటి నిల్వ పెరిగి భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో పాటు సాగునీటి అవసరాలకు ఉపయోగపడుతుందని, వనమహోత్సవం ద్వారా వ్యవసాయ క్షేత్రాలు, పరిసర ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించేందుకు రైతులు అధిక సంఖ్యలో మొక్కలు నాటాలని కోరారు.

## సిరిసిల్ల డ్రాయింగ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ రుద్ర రమేష్

అక్కన్నపేట, ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర) : సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ (గ్రా), మండల పరిషత్ (పీ) పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి వివిధ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించారు. డిప్యుటేషన్ ప్రాతిపదికన సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం, హైదరాబాద్‌తో పాటు జిల్లా విద్యాశాఖాధికారి, ఎక్స్-అఫిషియో జిల్లా ప్రాజెక్టు అధికారి కార్యాలయాల్లో కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ల పోస్టులను భర్తీ చేయనున్నారు.

అలాగే గ్రాణ తెలంగాణ కార్యాలయం, రాష్ట్రంలోని DEO, EO-DPO కార్యాలయాల్లో అసిస్టెంట్ కోఆర్డినేటర్ల పోస్టులను ఆన్ డ్యూటీ (గాణ) ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 8 నుంచి ప్రారంభమై, ఆగస్టు 17తో ముగియనుంది.

అర్హతలు, విద్యార్హతలు, ఎంపిక విధానం, మార్గదర్శకాలు తదితర పూర్తి వివరాలు ఆగస్టు 8 నుంచి అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## చేనేతకు చేయూత.. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

**- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్**

అక్కన్నపేట, ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర): చేనేత మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రపంచానికి తెలంగాణ కళాత్మకతను చాటిచెప్పే గొప్ప వారసత్వ సంపద చేనేత రంగమని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని చేనేత కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ చేనేత రంగాన్ని కాపాడుతున్న ప్రతి కార్మికుడి కృషి అభినందనీయమన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం, ఉపాధి భద్రత, ఆదాయ వృద్ధి కోసం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. చేనేత రంగం మరింత అభివృద్ధి చెందాలని, ప్రతి చేనేత కుటుంబం సుఖసంతోషాలతో, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## గడువు ముగిసిన మందు ఇస్తే పిల్లాడు చావాలా

మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పిల్లవాడికి గడువు ముగిసిన మందులు ఇచ్చిన సిబ్బంది





ఆసుపత్రి సిబ్బంది పై బాలుడి తండ్రి ఆగ్రహం

మహబూబాబాద్‌లోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మురళీ తన నాలుగేళ్ల కుమారుడు ఎనోస్ రాజ్‌కు వాంతులు, విరోచనాలతో అనారోగ్యానికి గురయ్యాడు

అయితే మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా ఓపీలో పరీక్షించిన రెండు సిరప్‌లు రాసిన డాక్టర్లు

ఒక సిరప్ ఆసుపత్రిలో ఉన్నది ఇవ్వగా మరో సిరప్ బయట తీసుకోమని చెప్పిన సిబ్బంది

ఇంటికి వెళ్లి బాలుడికి సిరప్ వేసేందుకు చూడగా.. జూన్ 2026కు గడువు ముగిసి ఉండటం గమనించి.. ఆసుపత్రికి వెళ్లి అడగగా సిబ్బందికి తండ్రికి మధ్య వాగ్వాదం

గడువు ముగిసిన మందు ఇస్తే పిల్లాడు చావాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన తండ్రి

# ప్రభుత్వ విద్య,వైద్యాన్ని బలోపేతం చేయడం ద్వారానే వికసిత్ భారత్ లక్ష్యాలు సాధ్యం

**- రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక,పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.**

**- కన్హా శాంతి వనంలో 'విజన్ ఇండియా--2047' జాతీయ సదస్సులో మంత్రి ప్రసంగం.**

నందిగామ:ఆగస్టు 07(విజన్ ఆంధ్ర న్యూస్: ప్రభుత్వం విద్య,వైద్యాన్ని బలోపేతం చేయడం ద్వారానే వికసిత్ భారత్ లక్ష్యాలు సాధ్యం అవుతాయని,స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన,స్వావలంబన కలిగిన విజ్ఞాన దేశంగా తీర్చిదిద్దడంలో యువత,శాస్త్ర విజ్ఞానం,పరిశోధన,ఆవిష్కరణలే ప్రధాన చోదక శక్తులని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,పురావస్తు,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.పాలమూరు విశ్వవిద్యాలయం,భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా కన్హా శాంతి వనంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు "విజన్ ఇండియా--2047: ఇంటిగ్రేటింగ్ సైన్స్,ఇన్నోవేషన్ అండ్ యూత్ ఎంపవర్మెంట్" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,పురావస్తు,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలంటే శాస్త్రీయ పరిశోధనలు,సాంకేతిక ఆవిష్కరణలు, యువశక్తి సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు(ఏఐ)డేటా





సైన్స్ బయోటెక్నాలజీ,సెమీకండక్టర్లు,పునరుత్పాదక ఇంధనం,అంతరిక్ష సాంకేతికత,స్టార్టప్‌లు వంటి రంగాలే భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా నిలుస్తాయని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో సమతుల్య, సుస్థిర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.ఇందుకోసం(సీయూఆర్ఈ,పియుఆర్ఈ,ఆర్ఏఆర్ఈ)మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధి అనే నాలుగు అభివృద్ధి స్తంభాల ఆధారంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు.ఆర్థికాభివృద్ధి మాత్రమే కాకుండా సమాజంలో ఆలోచనా విధానంలోనూ మార్పు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గ్రామీణ భారతం ఇప్పటికీ అప్పుల ఊబిలో ఉండటం ఆందోళనకరమని, ప్రజలు కార్పొరేట్ విద్య, వైద్యం, ఆడంబరాలకు అధికంగా ఖర్చు చేయడం వల్ల అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్య, వైద్య సేవలను మరింత నాణ్యంగా,బలోపేతంగా తీర్చిదిద్దడం ద్వారానే వికసిత్ భారత్--2047, రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యాలను సాధించవచ్చని స్పష్టం చేశారు.సామాజిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వం త్వరలో 'ప్రభాత భేరి'కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.విశ్వవిద్యాలయాలు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా పరిశోధన, ఆవిష్కరణలు,పారిశ్రామికవేత్తల తయారీ, సమాజాభివృద్ధికి కేంద్రాలుగా ఎదగాలని మంత్రి సూచించారు.ప్రభుత్వం--విశ్వవిద్యాలయాలు పరిశ్రమల మధ్య సమన్వయం బలోపేతమైతే యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన అవకాశాలు,ఉపాధి మరింత విస్తరిస్తాయని తెలిపారు.ఈ జాతీయ సదస్సులో జరిగే మేధోమథనం,చర్చలు దేశం,రాష్ట్రం నిర్దేశించుకున్న 2047 అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఆచరణాత్మక సూచనలను అందిస్తాయని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆశాభావం వ్యక్తం చేశారు.



## నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవికి "సహారా బాధితుల "సమస్యల చిట్టా

తలకొండపల్లి , ఆగస్టు 07( విజన్ ఆంధ్ర ); దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత మూడు రోజుల నుండి సహారా బాధితులు సహారా ఖాతాదారులు, ఏజెంట్ల తో కలిసి ధర్నా నిర్వహిస్తున్నారు. సహారా ఏజెంట్లు,ఖాతాదారులు శుక్రవారం ఢిల్లీలోని నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి నివాసంలో వారిని కలిసి సహారా బాధితుల సమస్యలపై పార్లమెంటులో మాట్లాడాలని,సహారా ఖాతాదారుల డబ్బులను తొందరగా ఖాతాదారులకు తిరిగి ఇప్పించాలని ఎంపీ మల్లు రవి ని సహారా బాధితులు కోరారు.

## జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



తలకొండపల్లి,ఆగస్టు07(విజన్ ఆంధ్ర); భారతీయ సంస్కృతికి, సాంప్రదాయానికి ప్రతీక అయిన మన చేనేత వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్న సందర్భంగా జాతీయ చేనేత దినోత్సవం నాడు కల్వకుర్తి శాససనభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి చేనేత కార్మికులకు,నేత కుటుంబాలకు శుభాకాంక్షలను తెలియజేశారు. చేనేత అంటే కేవలం వస్త్రం కాదు, అది మన పూర్వీకుల కళ, చెమట,ఆత్మగౌరవం,ఒక చీరలో,ఒక ధోవతిలో వేల కుటుంబాల కలలు అల్లుకొని ఉంటాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమంనికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి జీవనోపాధి బలోపేతానికి,సాంప్రదాయ కలల పరిరక్షణకు,ఆధునిక సాంకేతికతతో ఉత్పత్తి పెంచడానికి,కొత్త మార్కెట్లను అందించడానికి అనేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. చేనేతనం కొనడం అంటే ఒక కళాకారుడి జీవితానికి ఊపిరి పోయడమే,ప్రతి ఒక్కరూ స్వదేశీ చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలి

### రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్



పెద్ద శంకరంపేట్, ఆగస్టు 7: విజన్ ఆంధ్ర : పెద్ద శంకరంపేట్ ప్రభుత్వం చేనేత కార్మికులను అన్ని రకాలుగా ఆదుకోవాలని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని పెద్ద శంకరంపేటలో చేనేత కార్మికులు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు గుజ్జరి కనక రాజు అధ్యక్షతన మార్కండేయ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తిమీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న చేనేత కార్మికులందరికీ ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సాహం అందజేయాలని అన్నారు. రాష్ట్రంలో నేతన్న ల ఆకలి చావులు లేకుండా ప్రభుత్వం భరోసా కల్పించాలన్నారు పద్మశాలి కార్పొరేషన్ ద్వారా చేనేత వృత్తుల వారితోపాటు పద్మశాలీలలో ఇతర వృత్తులు చేసుకుంటున్నవారికి సైతం ఆర్థిక సహాయం అందజేయాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేనేత కార్మికులకు జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఒక్క చేనేత కార్మికుడికి 25వేల రూపాయలు దాదాపు 71 వేల 1903 మందికి అందించారని అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో సైతం ప్రతి ఒక్క చేనేత కార్మికుడికి ఆర్థిక సాయం అందజేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.. చేనేత కార్మికులు పద్మశాలీ లు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మేకల జయరాములు. పెద్ద శంకరంపేట మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు గుజ్జరి కనకరాజు. చేనేత సహకార సంఘం అధ్యక్షులు మహంకాళి కృష్ణమూర్తి.నీలి కుల సంఘం అధ్యక్షుడు దొడ్లే దశవంత్,నీల కంటి కులం అధ్యక్షుడు విట్టల్, పట్టణ అధ్యక్షులు జంగం రాములు గుజ్జరి సంగమేశ్వర్. అనిల్ డాక్టర్. ఉపేందర్ జంగం రాఘవులు. సిహెచ్ నవీన్ . నంశం గారి సంతోష్ కుమార్ . కోటగిరి రమేష్. పడాల రవి. ఆయా గ్రామాల నుండి చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## భూభారతి, సాదాబైనామా దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి
- తహసిల్దార్లతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా

నిజామాబాద్, ఆగస్టు 07 : (విజన్ ఆంధ్ర )భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమీక్ష మందిరంలో శుక్రవారం ఆయన అన్ని మండలాల తహసిల్దార్లతో భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు ఎన్ని అని ఆరా తీస్తూ, వాటి పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన జరుపుతూ ఈ నెలాఖరులోగా అన్నింటిని పరిష్కరించాలని కలెక్టర్ గడువు విధించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణితో పాటు, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సీ.ఎం ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వెంటదివెంట ఆర్జీలను పరిష్కరిస్తూ, వివరాలను ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. పై అంశాలకు సంబంధించి నిర్ణీత నమూనాలో రోజువారీగా తనకు వివరాలు పంపాలని ఆదేశించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ కోసం వచ్చిన దరఖాస్తులను కూడా సత్వరమే పరిశీలిసస్తూ పరిష్కరించాలన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకుని ఈ నెల 17వ తేదీ లోపు అన్ని ఎఫ్.ఆర్.సి దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. కస్టం మిల్లింగ్ కోసం లేవీ ధాన్యం కేటాయించిన రైస్ మిల్లులను ప్రతి పక్షం రోజులకు ఒకసారి అయిన తప్పనిసరిగా సందర్శిస్తూ, ధాన్యం నిల్వలను పరిశీలించాలని తహసిల్దార్లను ఆదేశించారు. నూతన తహసిల్దార్ కార్యాలయాల నిర్మాణాల కోసం ఆయా మండలాలలో అవసరమైన స్థలాలను గుర్తిస్తూ, సమగ్ర వివరాలతో నివేదికలు పంపాలని సూచించారు.

ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ

ఇదిలాఉండగా, సమీక్షా సమావేశానికి ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు కలెక్టర్ భవేష్ మిశ్రా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిర్ణీత సమయానికి కలెక్టర్ సమావేశ మందిరానికి చేరుకోగా, పలు మండలాల తహసిల్దార్లు గైర్హాజరు కావడాన్ని గమనించి వారి తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత సమయం అనంతరం మరో 15 నిమిషాల వరకు కూడా సమావేశం హాల్ కు చేరుకోలేకపోయిన తహసిల్దర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

## హుస్నాబాద్ మార్కండేయ ఆలయంలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం

- ప్రతి ఒక్కరు ఒక్కరు నాటాలి పకృతి పర్యావరణాన్ని కాపాడాలి
- మొక్కలు నాటడం హుస్నాబాద్ రాష్టంలోనే ఆదర్శంగా ఉండాలి
- బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 7 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని మార్కండేయ ఆలయంలో బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామి వారిని దర్శించుకొని జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా చేనేత వస్త్రాలు ప్రోత్సహిస్తామని ,చేనేత వస్త్రాలు ధరిస్తామని జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంత్రి ప్రతిజ్ఞ చేయించారు.ఇటీవల మరణించిన చేనేత కార్మికుడు అల్వాల రాములు కుటుంబానికి ప్రభుత్వం నుండి 5 లక్షల రూపాయల చెక్కు అందించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు నాగరికతకు మన కట్టే వస్త్రాల అలంకరణకు మార్కండేయ మూల వారసులకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఆర్థిక పరమైన ఏ అంశాలు పెండింగ్ లో లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లేకుండా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని, హ్యాండ్లుం తో పాటు పవర్ లూమ్ క్లస్టర్ లు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తామని ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.హుస్నాబాద్ లో విద్య ,వైద్యం,టూరిజం ,ఇండస్ట్రియల్ కారిడార్ అన్ని రంగాల్లో అభివృధి చేస్తున్నామన్నారు.పవర్ లూమ్ క్లస్టర్ పెట్టాలనుకునే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది.నేతన్న లకు చనిపోయిన కార్మికులకు 5 లక్షల ఆర్థిక సహాయం చేస్తుందన్నారు.

హుస్నాబాద్‌లో వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డిగ్రీ కళాశాలలో వన మహోత్సవంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే సమాజం మన అందరినీ హర్షించాలన్న , జ్ఞాపకం ఉంచుకోవాలన్న ప్రకృతి సమతుల్యం ఉంచుకోవాల్సిన బాధ్యత మన అందరిదన్నారు.ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి ప్రకృతి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. హుస్నాబాద్ లో మొక్కలు నాటి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుద్దామన్నారు. హుస్నాబాద్ లో ప్లాస్టిక్ నిషేధిస్తూ ఇప్పటికే స్టీల్ బ్యాంక్ కూడా ఇచ్చామని,స్టీల్ బ్యాంక్ మాత్రమే



కాదు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలన్నారు.మేము మొదటిసారి వచ్చినప్పుడు డిగ్రీ కళాశాల రోడ్డు లేకుండే, ఇపుడు సీసీ రోడ్డు అయిందన్నారు.కాంపౌండ్ వాల్ ,ఫ్లోరింగ్ ఏర్పాటు చేస్తాం, డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ, మున్సిపల్ కమిషనర్ టి మల్లికార్జున్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి వైస్ చైర్మన్ బంక చందు సింగిల్ విండో చైర్మన్ పోలిశెట్టి శివయ్య జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వివి రమణ నాయకులు చిత్తారి రవీందర్ అక్కు శ్రీనివాస్, చేన్నబోయిన విద్యాసాగర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫోరెన్సిక్ సైన్స్‌పై అవగాహన..

బోధన్, ఆగస్టు 07 (విజన్ ఆంధ్ర) : బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఫోరెన్సిక్ సైన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం చేపట్టిన ఈ కార్యక్రమానికి ఐదవ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కాంచన రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సెమినార్‌ను ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కార్యక్రమానికి హాజరై సభకు విశిష్టతను చేకూర్చారు. ప్రోబేలాబ్ ఫోరెన్సిక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ మోహన్ ఎర్రగొల్ల ప్రధాన వక్తగా పాల్గొని డాక్యుమెంట్ ఎగ్జామినేషన్, ఫింగర్‌ప్రింట్ విశ్లేషణ, ఆథెంటికేషన్, సైబర్ ఫోరెన్సిక్స్, క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్, డిఎన్ఏ పరీక్షలు, డిజిటల్ సాక్ష్యాల ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ఆర్.దేశాయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అడ్వకేట్ కె.విద్యాసాగర్ స్వాగతం పలికి, నేటి న్యాయవ్యవస్థలో ఫోరెన్సిక్ సైన్స్ ప్రాధాన్యతను వివరించారు. అడ్వకేట్ శంకర్, మోహన్ లు పాల్గొని.. న్యాయవాదులు ఇటువంటి శాస్త్రీయ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై 'యూటీఎఫ్' పోరుబాట

**- సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ అమలు చేయాలి**

**- టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఎస్.నరసింహ**

**- నాగన్ పల్లి పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన**



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర ) : ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ పోరుబాట పట్టిందని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఎస్.నరసింహ అన్నారు. యూఎస్ పీసీ ఆధ్వర్యంలో పీఆర్సీని ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరుతూ ఇబ్రహీంపట్నం మండలం నాగన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఎస్.నర్సింహ మాట్లాడుతూ... సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు పెండింగ్ డీఏలను ఒకే విడతలో చెల్లించాలని, పీఆర్సీని తక్షణమే చెల్లించాలని, జీవో నెంబర్ 25 సవరించాలని కోరారు. కేజీబీవీ మోడల్ స్కూల్, రెసిడెన్షియల్, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని దశలవారీగా పోరాటానికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా 7న నల్ల బ్యాడ్జీలతో ప్రతి పాఠశాలలో నిరసన కార్యక్రమాలు, అలాగే ఆగస్టు 12,13 తేదీలలో మండల కేంద్రాల్లో వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, వినతి పత్రాలు జిల్లా కలెక్టర్లకు, ఆగస్టు 29న హైదరాబాదులో రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా పిలుపునివ్వడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కౌన్సిలర్ కిరణ్ కుమార్, బొందయ్య, గోపాల్, కృష్ణకుమారి, శ్రీనివాస్, నరసింహ సుచరిత, లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, జయరాజ్, బాలస్వామి, నాగలక్ష్మి, అరుణ, భాగ్యశ్రీ, అనసూయ, అనూష, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ పోషణ:

**- మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకటరెడ్డి**

చేవెళ్ల, ఆగస్టు 07 (విజన్ ఆంధ్ర): తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ పోషణ లభిస్తుందని, ప్రతి తల్లి పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించి, తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి అని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తల్లిపాల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచే పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, కనీసం రెండేళ్ల వరకు తల్లిపాలు కొనసాగించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలని, ఆరు నెలలు నిండిన చిన్నారులకు బాల అమృతం, గుడ్లు తదితర పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ అత్తెల్లి మనీషాఅనంత్‌రెడ్డి, సూపర్‌వైజర్ రేవతి, అంగన్‌వాడీ టీచర్ భారతి, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజలకు ప్రజాప్రతినిధులకు మధ్య వారధిగా మీడియా సేవలు అమూల్యం :

**- ప్రజలకు ప్రజాప్రతినిధులకు మధ్య వారధిగా మీడియా సేవలు అమూల్యం : బండి రమేష్,**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) :

10 టీవీ ప్రతినిధి శ్రీ హరి జన్మదినం సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ ,బండి రమేష్ ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, జన్మదిన కేక్ కట్ చేయించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలో, ప్రజలకు రాజకీయ నాయకులకు మధ్య వారధిగా మీడియా ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తోందని అన్నారు. సమాజాభివృద్ధిలో మీడియా సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలకు సంబంధించిన ఏ సమస్య ఎదురైనా మీడియా ప్రతినిధులు తన దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని శ్రీ బండి రమేష్ గారు హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, పిడికిటి గోపాల్ చౌదరి, బీసీ నాయకులు తెల్ల హరికృష్ణ, విలేకరులు రాకేష్, సత్య, భాను, అనిల్, రంజిత్, శంకర్, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు నాగార్జున, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకురాలు రమణ, మహేష్, వాసు, కృష్ణవేణి, జ్యోతి తదితరులు పాల్గొని హరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నాణ్యతతో సమాచారం పక్కాగా సేకరించాలి

**- రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి**

**- జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ సమాచార సేకరణపై కలెక్టర్లతో వీ.సీ ద్వారా సమీక్ష**

నిజామాబాద్, ఆగస్టు 07 :( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (ఱఅర్‌తీఅఖ్ జవఅంబం ఖుఅఎఆశీశీ --ఱజఎదీ) రూపకల్పన కోసం ఫీల్డ్ ఫంక్షనరీలు క్షేత్రస్థాయిలో నాణ్యతతో సమాచారం పక్కాగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి సూచించారు. జనగణన--2027కు సంబంధించిన సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపకల్పన విషయమై ఆమె శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందించేందుకు విద్యా, వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా , కమ్యూనికేషన్, బ్యాంకింగ్, రుణ సదుపాయాలు, విద్యుత్, ఇంధన వనరులు, భూమి, సాగునీటి వినియోగం, వ్యవసాయం, తయారీ చేతివృత్తులు, గ్రామానికి సంబంధించిన ముఖ్యమైన ప్రత్యేక అంశాలు, పరిశీలనలు వంటి తొమ్మిది ప్రధాన అంశాలకు సంబంధించిన



సమాచారాన్ని ఖచ్చితత్వంతో అందించేలా చూడాలన్నారు. అదేవిధంగా టౌన్ డైరెక్టరీ షెడ్యూల్ ను ఛార్జ్ ఆఫీసర్లచే(మున్సిపల్ కమిషనర్) నియమించబడిన అధికారుల ద్వారా పట్టణ పౌర, పరిశ్రమలు, సామాజిక సదుపాయాలు, మురికివాడలకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారాన్ని సేకరించి ఛార్జ్ ఆఫీసర్లకు అందించాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల సమాచారాన్ని ఛార్జ్ ఆఫీసర్లు డీసీహెచ్ బీ పోర్టల్, మొబైల్ అప్లికేషన్‌ను ఉపయోగించి సమాచారాన్ని నాణ్యతతో నమోదు చేయాలన్నారు.

విలేజ్ డైరెక్టరీ సమాచారాన్ని 31.12.2025ను ప్రామాణిక తేదీగా తీసుకుని, రెవెన్యూ గ్రామాల వారీగా మొబైల్ అప్లికేషన్ లో సేకరించాలని సూచించారు. ఈ సమాచార సేకరణ ప్రక్రియ 10.08.2026 నుండి 08.09.2026 వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి వెల్లడించారు. జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, విధానాల అమలు, పరిశోధనలు, పరిపాలనా అవసరాలకు డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ ఒక ముఖ్యమైన ఆధార గ్రంథంగా ఉపయోగపడుతుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా సమాచారాన్ని సేకరించాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, సీ.పీ.ఓ కిషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## స్నేహ సొసైటీలో వైభవంగా బోనాల జాతర

నిజామాబాద్ ఆగస్టు07:( విజన్ ఆంధ్ర ) : శుక్రవారం రోజు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తారక రామనగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ వారి అందుల ప్రత్యేక పాఠశాలలో వైభవంగా బోనాల జాతర నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలతో అంగరంగ వైభవంగా బోనాల జాతర కొనసాగింది. స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ భవనం నుండి సమీపంలోని పోలేరమ్మ ఆలయం వరకు బోనాలతో నృత్యాలు చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ బోనాల జాతర కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ జరీనా ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్లు వివిధ వేషధారణలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో శుక్రవారం చివరి రోజు కావడంతో బోనాల జాతర ఆకట్టుకుంది. ఈ బోనాలకు స్నేహ సొసైటీ కార్యదర్శి మరియు ప్రిన్సిపాల్ ఎస్. సిద్దయ్య మరియు ఎస్ జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా బోనాల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ ఆషాఢ మాసంలో బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. స్నేహ సొసైటీలో గత 2014 నుండి క్రమం తప్పకుండా ప్రతి ఏడాది అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ పండుగగా బోనాలను జరుపుకుంటున్నారని, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందన్నారు. ఈ బోనాల కార్యక్రమంలో స్నేహ సొసైటీ అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ .జ్యోతి, మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ కార్యవర్గ సభ్యులు వీరేశం, స్నేహ టార్గెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ మేనేజర్ శివ , ఎం అండ్ ఇ విజయ్ , జి ఎన్ ఎం మౌనిక , శివసత్తులు వంశీ ప్రియ, సూచి, లాస్య, మరియు పోతరాజు నరహరి బోనం ఎత్తగా ట్రాన్స్ మహిళలు జరీనా, శ్యామల స్నేహసొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన కేటీఆర్

బోథ్. ఆగస్టు 7. (విజన్ ఆంధ్ర) : ఆపదలో ఉన్న బిఆర్ఎస్ కార్యకర్తలకు అండగా నిలిచి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మండలం, పొచ్చెర గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సోషల్ మీడియా ఆక్టివిస్ట్ మెట్పల్లి గంగాధర్ డీప్ వెయిన్ థ్రంబోసిస్ అనే ప్రాబ్లం తో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని గంగాధర్ మిత్రులు నరేష్ గౌడ్. మంజీర శ్రీనివాస్ లు సోషల్ మీడియా స్టేట్ ఇంచార్జ్ కొణతం దిలీప్ దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన ఈ విషయాన్ని కేటీఆర్ కు తెలుపగా కేటీఆర్ వ్యక్తిగతంగా స్పందించి సకాలంలో ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, శస్త్రచికిత్స (ఆపరేషన్) చేయించి ఆ కుటుంబానికి కొత్త జీవితాన్ని, పునర్జన్మను ప్రసాదించారు. వైద్య సహాయం పొంది సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకున్న అనంతరం, బాధితుడు తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్ ను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారి ఆరోగ్యం గురించి ఆరా తీసి, వారికి ఆత్మీయంగా ధైర్యం చెప్పారు.



తమకు ప్రాణదానం చేసి కుటుంబంలో వెలుగులు నింపిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు లకు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కేటీఆర్ మానవత్వం, సకాలంలో అందించిన సహాయం మా జీవితాంతం మరువలేమని వారు తీవ్ర ఆవేదనతో, కృతజ్ఞతాభావంతో పేర్కొన్నారు.

# తల్లిపాలుతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

## - డాక్టర్ సుశీల రత్నం

గజ్వేల్, 07 ఆగస్టు 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ మాతా శిశు సంరక్షణ కేంద్రం గజ్వేల్ లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల రత్నం హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆహారం అని పాపకు కావలసిన పోషక పదార్థాలు విటమిన్స్ ఉంటాయని, శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అమృతంగా పనిచేస్తాయని పుట్టిన అరగంట లోపు తల్లిపాలు ఇవ్వాలని, పుట్టగానే వచ్చేపాలు ముర్రుపాలు ఒక యాంటీబయటిక్ టీకాగా పనిచేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ త్రివేణి, డాక్టర్ మాధవి, పీడియాట్రిషన్ శాంతం రెడ్డి, డాక్టర్ వినోద్, మాతా శిశు సంరక్షణ కేంద్రం నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, హెడ్నర్స్ జగదాంబ, వీణ, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ వకులాదేవి, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ రజిత, నర్సింగ్ ఆఫీసర్స్ సరళ, నాగేశ్వరి, జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్ నేత, బి.స్వప్న, లత, దేవి, రేణుక, ఆంజనేయులు, ఈశ్వరి భాయ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్



కళాశాల ప్రిన్సిపాల్ చైనీ, కళాశాల అధ్యాపకులు, లైన్స్ క్లబ్ స్నేహ చైర్మన్ డాక్టర్ కుమారస్వామి, సత్యనారాయణ, లచ్చాలు సేటు, విద్యార్థిని, విద్యార్థులచే పాలిచ్చే విధానం కంగారు పద్ధతిలో ఏ విధంగా పాలు ఇవ్వాలని కనులకు కట్టినట్టుగా నాటకీ రూపంలో కళ ప్రదర్శన ద్వారా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలింతలు గర్భవతులు పేరెంట్స్ పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, అధిక సంఖ్యలో పాల్గొన్న కార్యక్రమం విజయవంతం చేసినారు.

# తల్లి పాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ

## - సిద్ధన్నపేటలో తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ.. సదస్సు

నంగునూరు మండలం ఆగస్టు 7 విజన్ ఆంధ్ర : శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో కీలకమని సిద్ధన్నపేట సర్పంచి సంగు పురేందర్ అన్నారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామంలో శుక్రవారం తల్లి పాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి, తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుకు అందించాల్సిన పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై వివరించారు. బిడ్డ ఆరోగ్యవంతంగా ఎదగడానికి తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని, కుటుంబ సభ్యులు కూడా బాలింతలకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

**సమాజం భాగస్వామ్యంతోనే చైతన్యం**

శిశువుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతి కుటుంబంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించి, శాస్త్రీయమైన ఆరోగ్య సమాచారాన్ని ప్రజలకు చేర వేయడంలో ఆరోగ్య, అంగన్వాడీ సిబ్బంది కీలక పాత్ర



పోషించాలని తెలిపారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు అందించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు.

**తల్లిపాలు శిశువుకు మొదటి టీకాలి**

నవజాత శిశువుకు తల్లిపాలే అత్యుత్తమ ఆహారమని బహుళ ప్రయోజన ఆరోగ్య సహాయకులు(ఎంపీహెచ్ఏ) సరస్వతి చెప్పారు. శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు తల్లి పాలలో సమృద్ధిగా ఉంటాయని వివరించారు. ముఖ్యంగా బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. వాటిని తప్పనిసరిగా అందించాలని చెప్పారు. తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా వంటివని తెలిపారు. తల్లిపాలు శిశువుకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు, వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తాయని పంచాయతీ కార్యదర్శి అనితా రెడ్డి తెలిపారు. తల్లిపాలు అందించడం వల్ల తల్లీ బిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని అన్నారు. తల్లికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.

**- ర్యాలీతో అవగాహన**

తల్లి పాల ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. “తల్లిపాలే బిడ్డకు తొలి ఆహారం”, “తల్లిపాలతో ఆరోగ్యవంతమైన బాల్యం” వంటి సందేశాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సంగు పురేందర్, ఉప సర్పంచి చిలుకల తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనితా రెడ్డి, వార్డు సభ్యులు రాజు, దాకూరి రాజిరెడ్డి, ఏఎన్ఎం సరస్వతి, అంగన్వాడీ కార్యకర్తలు కత్తుల భవాని, కాచగోని లావణ్య పాల్గొన్నారు. గ్రామస్థులు ఉడుతల దుర్గయ్య, తదితరులు కార్యక్రమంలో పాల్గొని తల్లి పాల ప్రాముఖ్యతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

**- ఆరోగ్యవంతమైన తరానికి బలమైన పునాది**

బిడ్డ జీవితంలో తొలి దశ అత్యంత కీలకమైనదని, ఈ దశలో సరైన పోషకాహారం, తల్లిపాలు, ఆరోగ్య సంరక్షణ అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించవచ్చని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. తల్లి పాలపై అవగాహనను కేవలం ఒకరోజు కార్యక్రమానికే పరిమితం చేయకుండా ప్రతి గ్రామంలో నిరంతరం కొనసాగించాలని కోరారు.



## మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

కుల్కచర్ల, ఆగస్టు, 07(విజన్ ఆంధ్ర): మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం అవుతుందని పీరంపల్లి సర్పంచి వెంకటయ్య, ఉప సర్పంచి శాంతమ్మ తెలిపారు. కుల్కచర్ల మండలం పీరంపల్లి గ్రామంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎక్కడైతే అడవులు విస్తరించి ఉంటాయో అక్కడ వర్షాలు ఎక్కువగా కురుస్తాయన్నారు. అందుకే మన వంతు బాధ్యతగా రెండు మొక్కలను తప్పకుండా నాటి సంరక్షించాలని సూచించారు. అందుకే గ్రామంలో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, స్థానికులు మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### - దేవర సమతావెంకట్‌రెడ్డి



చేవెళ్ల, ఆగస్టు 07 (విజన్ ఆంధ్ర): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజలందరూ భాగస్వాములైతేనే సీజనల్ వ్యాధులను సమర్థంగా నివారించగలం అని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్‌రెడ్డి అన్నారు. కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం 14వ వార్డులో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బేగరి జంగయ్య, మల్లెల అంతమ్మ, ఇళ్ల ముందు పాడుబడిన మట్టి ఇండ్లను కూల్చివేసి, పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఇళ్ల మధ్య పెరిగిన పొదల కారణంగా పాములు, పందులు, వీధి కుక్కల సంచారం పెరగడంతో పాటు దోమల బెడద అధికంగా ఉందని కాలనీవాసులు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ... పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ సాయి చైతన్య పాఠశాలలో బోనాల సంబరాలు

చేవెళ్ల, ఆగస్టు 07 (విజన్ ఆంధ్ర): విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడమే బోనాల వేడుకల నిర్వహణ ప్రధాన ఉద్దేశమని శ్రీ సాయి చైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని శ్రీ సాయి చైతన్య ఉన్నత పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు బోనాలతో ఊరేగింపుగా పాల్గొనగా, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# చేనేత కార్మికుల పొట్టగొడుతున్న కార్పొరేట్ సంస్థలు

- ముడిసరుకుకు కేంద్రం జీఎస్టీ మినహాయించాలి
- సంక్షేమ పథకాల్లో చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు అంక్షారెడ్డి



గజ్వేల్, 07 ఆగస్టు 2026 (విజన్ ఆంధ్ర) : చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు అంక్షారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం గజ్వేల్ లోని మగ్గం చౌరస్తాలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి హాజరై ఆమె మాట్లాడారు. కార్పొరేట్ సంస్థల ప్రవేశంతో కార్మికుల పూట గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కార్పొరేట్ సంస్థల ప్రమేయాన్ని తగ్గించి కేంద్రం చేనేతకు అవసరమయ్యే ముడి సరుకుకు జీఎస్టి మినహాయించాలని డిమాండ్ చేశారు. కాగా పండగ పర్వదినాల్లో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు చీరల పంపిణీ చేస్తుండగా, నేరుగా చేనేత కార్మికుల నుండి కొనుగోలు చేస్తూ వారిని ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అలాగే వివిధ రకాల పెన్షన్లు, వివిధ రాయితీలను కల్పిస్తూ సహకరిస్తుండగా, చేనేత కార్మికుల వస్త్రాలను కొనుగోలు చేస్తూ ఆర్థిక చేయూతనివ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఏటా ప్రభుత్వం చేనేత కార్మికుడికి ఆర్థిక సహాయం అందిస్తుండగా, ఉచిత విద్యుత్ వర్తింపజేస్తూ పాత బకాయిలను రద్దు చేసినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు రాజేశం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, మజీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ మతీన్, మాజీ కో ఆప్షన్ సభ్యులు షరీఫ్, పద్మశాలి యువజన జిల్లా విభాగం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండల్ రెడ్డి, నేతలు సారిక శ్రీనివాస్ రెడ్డి, నేత నాగరాజు, గాడిపల్లి శ్రీనివాస్, రమేష్ గౌడ్, జగ్గయ్య గారి శేఖర్, రాములు గౌడ్, సమీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 9న ఆదివాసీ వేడుకలను విజయవంతం చేయాలి



నార్నూర్, ఆగస్టు 07(విజన్ ఆంధ్ర): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న నిర్వహించనున్న వేడుకలను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నార్నూర్ మండల కేంద్రంలోని కొమరం భీం భవన్‌లో అన్ని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు 9న ఉదయం 10 గంటలకు నార్నూర్ మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం ఉట్నూర్‌లో జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు భారీ ర్యాలీగా తరలివెళ్లాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆదివాసీ ఐక్యతను చాటేలా అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, యువత, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో రాయ్ సెంటర్ సార్మేడి గౌరవ అధ్యక్షులు మెస్రం దుర్గు పటేల్, జేవీసీ కమిటీ ఛైర్మన్ మెస్రం రూప్ దేవ్ పటేల్, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పేందూర్ దాదిరావ్, జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మాణిక్‌రావు, మండల అధ్యక్షుడు అడా శ్రీరామ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కనక సత్యం, మాజీ అధ్యక్షుడు ఉర్వేత రూప్ దేవ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, ఆదివాసీ సలహాదారుడు మెస్రం హన్మంత్‌రావ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు పుసం ఇస్రు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేందూర్ దీపక్, రాజ్ గొండ్ సేవ సమితి అధ్యక్షుడు ఆత్రం పరమేశ్వర్, మాజీ సర్పంచ్ మడావి ఆనంద్ సాగర్, రాజ్ గొండ్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు చత్రుషావ్, బలంపూర్ సార్మేడి భాగవంత్ షావ్, మాజీ సర్పంచ్ మడావి రూప్ దేవ్, మోతీరాం మెస్రం యాదోరావ్‌తో పాటు వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

# త్వరలో రూ.25 లక్షల నిధులతో అభివృద్ధికి శ్రీకారం

- మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి.
- అధికారులు, స్థానిక కౌన్సిలర్ తో 8వ వార్డ్‌లో పర్యటించిన చైర్ పర్సన్



తాండూరు ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర) త్వరలో 8వ వార్డులో రూ.25 లక్షల నిధులతో అభివృద్ధికి శ్రీకారం శ్రీకారం చుట్టనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్రెడ్డి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చైర్‌పర్సన్ అధికారులు స్థానిక వార్డు కౌన్సిలర్, పార్టీ నేతలతో కలిసి 8వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ 8వ వార్డును దశలవారీగా అభివృద్ధి చేస్తామని, త్వరలోనే సీసీ రోడ్లు పనులను ప్రారంభిస్తామని తెలిపారు. వార్డులో మిగిలిన అభివృద్ధి పనుల వివరాలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వారి సహకారంతో పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు.
రాజీవ్ ఇందిరమ్మ కాలనీలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కల్పించిందని, ఆయా కాలనీల అభివృద్ధికి కూడా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ కమిషనర్, అధికారులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

గజ్వేల్, 07 ఆగస్టు 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 20వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్వాడీ కేంద్రంలోని చిన్న పిల్లలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లి పాలు అమృతం లాంటివని పేర్కొన్నారు. పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలల పాటు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, ఇది బిడ్డకు కొండంత రక్షణను, వ్యాధి నిరోధక శక్తిని అందిస్తుందని వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాజంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నాగమణి, ఆయా అనసూయ, వార్డు నాయకులు, మహిళలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో గోరింటాకు పండుగ

ముధోల్:07ఆగస్టు:విజన్ ఆంధ్ర : ముధోల్ మండల కేంద్రంలోని జెడ్పి హెచ్ఎస్ పాఠశాలలో సాంప్రదాయాలను ప్రతిబింబించేలా గోరింటాకు సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయు లు ఘనంగా జరుపుకున్నారు. శుక్ర వారం ఆషాడమాసం పురస్కరిచు కొని పాఠశాలలో విద్యార్థులు, ఉపా ధ్యాయులు ఒక్కనొక్కరు గోరిం టాకు పెట్టుకున్నారు. ఈ సందర్భం గా ఉపాధ్యాయులు మాట్లాడు తూ..విద్యాబోధనతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు పండు గలు ప్రాముఖ్యతను తెలుసుకో వాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునికత పెరుగు తున్నప్పటికీ మన సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోకుండా భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు

# జైల్ బరో జయప్రదం చేయండి సిఐటియు

**- మండల కార్యదర్శి బాలగౌడ్**

వీపనగండ్ల ఆగస్టు 6 విజన్ ఆంధ్ర. వీపనగండ్ల. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో. ఈనెల 10న నిర్వహించే జైల్ పరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బాల గౌడ్ వ్యవసాయ కార్మిక సంఘం. రైతు సంఘం ఆధ్వర్యంలో మండల సదస్సు నిర్వహించడం జరుగుతుందని నాయకులు పిలుపునిచ్చారు. వీపనగండ్ల మండల కేంద్రంలోని కామ్రేడ్ నరసింహ కార్యాలయంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు రైతంగం జిల్లా నాయకులు దేవేందర్ వేసా కార్మిక సంఘం మండల అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ ఈనెల 10న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు ఒకటి నుంచి దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎనిమిది గంటల పని దినాన్ని రద్దు చేస్తూ 12 గంటలు పని దినాలు తీసుకురావడం కార్మికులకు తీరని నష్టం చేసే విధంగా ఉన్నాయని వెంటనే నాలుగు లేబర్ కోర్సు రద్దుచేసి 29 కార్మిక చట్టాలను పునరించాలని డిమాండ్ చేశారు దేశంలో నిరుద్యోగులకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టాన్ని తీసివేసి విపి రాంజీ పేరుతో ఉపాధి హామీని మీరు కార్చే విధంగా రాష్ట్ర వాటా 40 శాతం కేంద్ర మాటా 60% జమ చేస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందాలి గత ప్రభుత్వం 9% నుంచి నిధులు ఇచ్చే వారిని వెంటనే విపి రాజీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు రైతు కూలీలకు ఎస్ఎస్పీ చట్టాన్ని అమలు చేయాలని గిట్టుబాటు ధర కల్పించాలని భారతదేశంగానికి స్వాతంత్ర రాకముందు ఆగస్టు 6న క్విట్ ఇండియా ఉద్యమాన్ని రగిలించి భారత దేశ ప్రజలను ఐక్యం చేసి బ్రిటీష్ వాళ్ళను దేశం నుంచి తరిమేశారని కానీ మోడీ ప్రభుత్వం కార్పోరేటర్లకు కారు చౌకగా ప్రభుత్వ రంగ సంస్థలను భారతదేశం యొక్క భౌగోళిక స్వరూపాన్ని ధ్వంసం చేసే విధంగా కార్పొరేట్ సంస్థలకు ఇతర దేశాలకు నౌకగా అమ్మేయడం జరుగుతుందని వారు విమర్శించారు ప్రభుత్వాలు విధానంలో ఖండించాలని కార్మికులకు పిలుపునిచ్చారు ప్రజల యొక్క మౌలిక హక్కులను కాపాడాలని కార్మిక వర్గాన్ని నిలబెట్టాలని వారు

## కార్యకర్తలను నాయకులుగా చేసేందుకు పుట్టిన పార్టీ జనసేన

**-8వ తేదీన జనసేన పార్టీ రెండు జిల్లాల సన్నాహక సమావేశం**

**-జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు మీసాల శ్రీనివాసరావు**

నిజామాబాద్, ఆగష్టు07:( విజన్ ఆంధ్ర ) : జనసేన పార్టీ కార్యకర్తలను నాయకులుగా చేసేందుకే పుట్టిన పార్టీ అని వెల్లడించారు. జనసేన పార్టీ నిజామాబాద్, జహీరాబాద్ జిల్లాల సన్నహాకా సమావేశం ఈనెల 8వ తేదీ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుగుణ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర నాయకుడు మీసాల శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న రోజులలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కేంద్రంలో గాని, రాష్ట్రంలో గాని కీలకంగా మారబోతున్నారన్నారు. 8 వ తేదీన తేదీన నిర్వహించబోయే సన్నాహక సమావేశానికి రాష్ట్రంలోని ముఖ్య నాయకులందరూ విచ్చేస్తున్నారని కార్యకర్తలు అందరూ పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన రాష్ట్ర అబ్జర్వర్ శర్మ, మీడియా ఇన్చార్జ్ దుంపటి శ్రీనివాస్, జిల్లా నాయకుడు గుండా సంతోష్, కోరుట్ల నాయకులు అజయ్, ఉప సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు రమేష్ బాసవేణి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 7 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని గిరిజన ఆశ్రమ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం రోజున మండల న్యాయ సేవాధికారి సంస్థ జూనియర్ సివిల్ కోర్టు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రేవతి మాట్లాడుతూ న్యాయ విజ్ఞాన సదస్సు ద్వారా గిరిజనులకు న్యాయపరంగా పొందే హక్కులపై న్యాయ సలహాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జడ్జి అబిదా,మాజీ ఏజీపీ కన్నోజు రామకృష్ణ,న్యాయవాది సంధ్యారాణి కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# జోర్దార్గ కొనసాగిన ఆలయంలో అన్నదానం

బాల్కొండ (నిజామాబాదు ) విజన్ ఆంధ్ర ఆర్. సి.ఆగస్ట్ 07 :- నిజామాబాదు జిల్లా బాల్కొండ లో 524 సంవత్సరాలనుండి కొలువై ఉన్న శ్రీ నిమిషంబా ఆలయంలో ఆగస్ట్ మొదటి శుక్రవారశీ శ్రీ నిమిషంభ దేవి అమ్మ వారికి అభిషేకం నిరహించగ ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాదు, జగిత్యాల నుండి భక్తులు హాజరైనారు.అనంతరం శ్రీ అనంతరం అమ్మవారికి ఒడి బియ్యాలు సమర్పించు కున్నారు.అనంతరం ఆగస్ట్ నెల మొదటి శుక్రవారం అన్నదానంలో భాగంగా టోకెన్ నెం (79)"శ్రీ నిమిషంబ ఆలయం ద్వారా" అన్నదానం కార్యక్రమంలో హైదరాబాద్ కు చెందిన రామరాజు, బాల్కొండకు చెందిన బ్రహ్మ రౌతు జయచిత్ర రాజేందర్, బి.రామ,గంగాధర్, బి. మణెమ్మ నర్సింగ్ రావు సంయుక్తంగా అన్నదానం చేసారు.ఈ కార్యక్రమంలో సత్వవే సంతోష్, డాక్టర్ డి. పవన్ పాల్గొన్నారు. "అన్న దానం మహాదానం " ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేస్తే పుణ్యఫలం, ఎవరైతే అన్నం దానం చేస్తారో వారింట్లో "నిత్యం అన్నపూర్ణ " కొలిచినట్లు, పైగా సిరి సంపాదలకు నిలయంగా మారు తుందని ఆలయ సేవకులు బి. ఆర్. నర్సింగ్ రావుఈ సందర్భంగా విజ్ఞప్తి చేసారు.

అన్న దానానికి ఖాళీలు

2026,సెప్టెంబర్ నుండి 2026 డిసెంబర్ వరకు ప్రతి నెల మొదటి శుక్రవారాల్లో అన్నదానం చేయాలనుకు నే కుటుంబాలు తమ కుటుంబ పేర్లు, గోత్రాలు మరియు కుటుంబ సమూహ ఫోటోలతో 9666759297 నంబ రెకు ఫోన్ చేసి టోకెన్ నంబర్ పొందాలని ఆలయ సేవకులు బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు కోరారు."అలకొండ



పురి రమ్య నగ్రె: నవబి రావుతా !తత్రేషా తు మహాదేవి నిమిషాంబా ప్రతిష్ఠితా!! (తొమ్మిది ఏతైనా నల్ల రాళ్ల కొండల చేత చుట్టబడి ఉన్న అందమైన అల్లకుండ,వల్లకొండ, ఏ బాల్కొండ లో భారత దేశంలోనే 4వ ఆలయంగా ప్రసిద్ధి.ఈ ఆలయంలోని శ్రీ నిమిషంబ దేవి ప్రతి రూప మైన పంచలోహ విగ్రహనీకి నిత్య నైవేద్య పూజలు అందు కుంటుందని ఆలయ పూజారి శ్రీ శ్రీ శ్రీ బి. కృష్ణ రావు జోషి తెలిపారు.

ఆలయంలో పనులకు చేయూత ఇవ్వండి

ఈ ఆలయంలో పలు అభివృద్ధి పనులు జరుగా నున్నాయని (1).ఆలయంలో ఉత్తర దక్షిణ సింహ ద్వారం పనులు.(2).అమ్మ వారి నవరాత్రుల్లో ఉత్సవాలు (3).అమ్మ వారి జన్మ దిన ఉత్సవాలు (4).శ్రీ నిమిషంబ దేవి కల్యాణ మండపం నిర్మాణం. మీరు పంపే కానుకలు " శ్రీ నిమిషంబ దేవి టెంపుల్ డెవలప్మెంట్ సొసైటీ " అకౌంట్ నంబర్ 073710011109628,యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా "బాల్కొండ " నిజామాబాదు బ్రాంచి ఐ. ఆఫ్. ఎస్.సి. నేం.యి.బీ.ఐ.యన్. 0807371.లేదా క్యూ.. ఆర్. కోడ్ ద్వారా పంపి "స్క్రీన్ షాట్" ను 9666759297 నంబర్కు పంపాలని ఆలయ సేవకులు బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు కోరారు.

కనపడటం లేదు

నేటి రోజుల్లో నారి మణుల్లో నుదుటన కుంకుమ,కళ్ళకు కాటిక, తలలో పూలు, అంద మైన వాలు జడ, చేతులకు గాజులు, ఒళ్ళు నిండా చీర, జాకెట్,కాళ్లకు మట్టేలు, కాకుండా నేటి స్త్రీలు నుదుటిన చిన్న టికిల్ బొట్టు, పెదవులకు లిప్టిక్,తల వెంట్రు కలు విర బూసిన వెంట్రుకలు, ఒళ్ళు కనిపించే విధంగా రెడీ మేడ్ వస్త్రా లను ధరించి ఆలయాల్లో కి వస్తే ఆలయంలోకి ప్రవేశం లేదని తేల్చి చెప్పారు.

ఈ క్షేత్రానికి ఏలా చేరుకోవాలి

భారత దేశంలోనే 4 వ పంచలోహ విగ్రహం తో కొలువై ఉన్న శ్రీ నిమిషంబ దేవిబాల్కొండలోనే కొలువై ఉందని పవిత్ర శక్తి పీఠాలలో ఉత్తమ మైన శక్తి స్వరూపిణి ఆలయం హైదరాబాద్ పట్టణానికి 200 కిలోమీటర్ దూరంలో హైదరా బాద్ - నాగపూర్ జాతీయ రహదారిని ఆనుకొనే బాల్కొండ ఉందని,బస్సు రవాణా సౌకర్యాలు ఉన్నాయని

# కాళేశ్వరంలో నూతన బస్టాండ్ నిర్మాణం చేర్చనీయాంశం..!

**వ్యాపారులకు సకరిస్తారా...?**

**అభివృద్ధి కి సకరిస్తారా..?**

**రాష్ట్ర ఐటీ మంత్రి ...!**

మహాదేవపూర్ ఆగస్టు 07 (విజన్ ఆంధ్ర) : కాళేశ్వరం అభివృద్ధిలో భాగంగా నూతన బస్టాండ్ నిర్మాణం కోసం 3.96 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది కానీ కాళేశ్వరంలో నూతన బస్టాండ్ కోసం వ్యాపార వర్గ పోరు కొనసాగుతుందని చర్చనీయాంశంగా మారింది జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపురం మండలం కాళేశ్వర గ్రామంలోని నూతన బస్టాండ్ నిర్మాణం కోసం మొదట ఎస్టీ కాలనీలోని హనుమాన్ ఆలయం ముందు ఉన్న 129 సర్వే నెంబర్ ఫారెస్ట్ భూమిలో నూతన బస్టాండ్ నిర్మాణం చేయాలని నిర్ణయించగా అడవి శాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో ఆగిపోయింది అదే అదునుగా తీసుకొని కొందరు వ్యాపారవేత్తలు ఒక వర్గానికి చెందినా వారు కలిసి 141 సర్వే నెంబర్ చాకి కుంట నూతన బస్టాండ్ నిర్మాణాన్ని చేయాలని మంత్రి శ్రీధర్ బాబును కలెక్టర్ రాహుల్ శర్మను కలవడంతో చాకి కుంట 141 సర్వే చేసి విస్తీర్ణతను అంచనా వేయాలని తెలియజేశారు కానీ కాళేశ్వరం గ్రామంలో పాలకవర్గంలో 9 మందితో పాటు 500 మంది గ్రామస్తులు బస్టాండ్ నిర్మాణం 129 సర్వేనెంబర్ అడివి ప్రాంతంలో జరపాలని అభిప్రాయపడ్డారు. కానీ అధికారులు, మంత్రివర్యులు ప్రాంత అభివృద్ధి, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తూ ఒక వర్గానికి మేలు చేయటానికి



చాకి కుంటలో బస్టాండ్ నిర్మాణం కోసం సర్వే చేయటానికి అధికారులని పంపటం పై గ్రామస్థులో చర్చనియాంశంగా మారింది . కాళేశ్వరం యువకులు కూడా గతం లో సాకి కుంట ని క్రీడా ప్రాంగణం ల క్రికెట్ మరియు కబడ్డీ, ఉదయం పూట జాగింగ్ చేసే వాళ్ళమని గుర్తు చేసుకుంటూ ఈరోజు మా క్రీడా ప్రాంగణం లేకుండా పోతుంది అని బాధ పడుతున్నారు. అలాగే పూర్వ వైభవన్నీ తీసుకొని వచ్చి సాకి కుంటని క్రీడాస్థలం లాగే ఉంచాలని యువత విన్నవించుకున్న అధికారులు మాత్రం చెల్లించడం లేదు . గ్రామంలో పలు పార్టీ ల నాయకులు, అధికార పార్టీ నాయకులు ఊరి పెద్దలు యువకులు కూడా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా హైడ్రా ని చేపట్టి హైదరాబాద్ నగర ప్రాంతంలో ఎన్నో చెరువులు కబ్జాకు గురి అయితే అడ్డుగా అక్రమంగా ఉన్న ఇంళ్ళని కూడా తీసేసారు చెరువులకు పూర్వ వైభవాన్ని తీసుకవచ్చింది అలాంటింది, కాళేశ్వరం లో మంత్రి శ్రీధర్ బాబు చెరువునే లేకుండా చేయాలనీ అనుకోవటం ఏంటి అని

ప్రజలు ఆరోపిస్తున్నారు . కాళేశ్వరం లో చాకి కుంట లో కాకుండా సర్వే నెంబర్ 129 అటవీ ప్రాంతం లో బస్టాండ్ నిర్మాణం జరిగితే పుస్కుపల్లి, ఇప్పలబోరు, మజీద్ పల్లి, ఎస్టి కాలనీ, హనుమాన్ నగర్, దుబ్బగూడెం, అయినటువంటి ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయని ఆ ప్రాంత ప్రజలు అనుకుంటున్నారు. వేచి చూడాలి ఎం జరుగుతుందో..?

**చాక్కుంట 141 సర్వేపై ఎమ్మార్వో వివరణ**

నూతన బస్టాండ్ నిర్మాణం 141 సర్వే చాక్కుంటలో నెంబర్లు సర్వే చేయగా రాష్ట్ర ప్రభుత్వం కబ్జా అయిన చెరువులని స్వాధీనపరచుకొని చెరువులకు నూతన పూర్వ వైభవం తీసుకువస్తూ హైడ్రని తీసుకువచ్చింది కానీ ప్రభుత్వ అధికారులు ఆ చెరువులని తీసివేసి నూతన బస్టాండ్ ఏ విధంగా నిర్మిస్తారని ప్రశ్నించగా పై అధికారుల ఆదేశం అనుసారంగానే మేము 141 సర్వేలో చాక్కుంట విస్తీర్ణతను మాత్రమే సర్వే చేశాము కానీ నూతన బస్టాండ్ నిర్మాణానికి ఎలాంటి పర్మిషన్లు ఇవ్వలేదు పర్మిషన్లు కూడా శిఖం భూమిలో ఇవ్వరు అని ఎమ్మార్వో తెలియజేశారు

**ఇరిగేషన్ అధికారి..!**

ఇరిగేషన్ అధికారికి ఫోన్ చేయగా 141 సర్వేనెంబర్ లో గల చాకి కుంటని సర్వే మాత్రమే చేసి దాని విస్తీర్ణత ఎంతో తెలుసుకోవడానికి మాత్రమే అని నూతన బస్టాండ్ నిర్మాణం శిఖం భూమిలో ఎప్పటికీ పర్మిషన్ ఇవ్వడం కుదరదని ఇరిగేషన్ అధికారి తెలియజేశారు

# తల్లిపాలు శిశువుకు అమృతధార

**- సనాదుల బాలపోచయ్య, సర్పంచి నంగునూరు**

**- నంగునూరులో తల్లిపాలపై అవగాహన**



నంగునూరు మండలం ఆగస్టు 7 విజన్ ఆంధ్ర : తల్లిపాలు శిశువుకు అమృత ధార వంటివని నంగునూరు సర్పంచి సనాదుల బాల పోచయ్య అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని నంగునూరు మండలం నంగునూరులో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు రమాదేవి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచి సనాదుల బాలపోచయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తల్లులు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిశువుకు పుట్టిన మొదటి గంటలోపే తల్లిపాలు పట్టించాలని, శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే ఇవ్వాలని సిబ్బంది సూచించారు. ఆరు నెలలు నిండిన తర్వాత పిల్లలకు తగిన అనుబంధ ఆహారాన్ని ప్రారంభించి, రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగించాలని తల్లులకు వివరించారు.తల్లులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. శిశువుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి నెలా పిల్లల బరువు, ఎత్తును నమోదు చేయించి వారి ఎదుగుదలను పరిశీలించాలని తెలిపారు. పిల్లల్లో పోషకాహార లోపాలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఆరు నెలలు పూర్తి చేసుకున్న చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు శిశువులకు అందించాల్సిన అనుబంధ ఆహారం, పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సనాదుల బాల పోచయ్య, వార్డు సభ్యులు స్వప్న, అఖిల, గ్రామ పంచాయతీ కార్యదర్శి నితీష్ కుమార్, అంగన్ వాడీ టీచర్లు తోట పద్మ, గాజర్ల ఇందిర, విమల, ఎస్.లక్ష్మి, ఎం.లక్ష్మి, రాజ మల్లవ్వ, సీఆర్‌పీ శిరీష, పలువురు తల్లులు పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.

# ప్రాథమిక పాఠశాలలో గోరింటాకు సంబురాలు....

కుకునూరుపల్లి, ఆగష్టు 07,విజన్ ఆంధ్ర : ఆషాడ మాసం పురస్కరించుకొని శుక్రవారం కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో గోరింటాకు సంబరాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా మహిళా ఉపాధ్యాయునిలు చిన్నారుల చేతులకు సహజంగా తయారు చేసిన గోరింటాను పెట్టారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కూరెళ్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాణి, స్వరూప రాణి, శంకరయ్య, ప్రీ ప్రైమరి టీచర్ స్రుజన తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో పోచమ్మ తల్లి బోనాల పండుగ

కుల్కచర్ల, ఆగస్టు, 07 ( విజన్ ఆంధ్ర): కుల్కచర్లలో పోచమ్మ తల్లి బోనాల పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగ ఉండటంతో నిర్వహకులు పోచమ్మ తల్లి దేవాలయాన్ని రంగు రంగుల పూలు, మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. పండుగ ఉండటంతో ఆలయం దగ్గర ఉదయం నుంచే సందడి మొదలైంది. భక్తులు తమ కోరికలు నెరవేరాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపులో మహిళల కోలాట నృత్యాలు, పోతురాజుల విన్యాసాలు అందరినీ అలరించాయి. ఈ సారి వర్షాలు ఎక్కువగా కురిపించాలని పంటలు బాగా పండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు స్థానికులు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



# కనుమరుగైన కరకల్ల రోడ్డును గుర్తించండి!

**పాత నక్ష ప్రకారం గుర్తించి మరమ్మతులు చేయాలి**

**- తహసీల్దార్‌కు తాడిచర్ల రైతుల వినతి**

మల్హర్, ఆగస్టు 07 విజన్ ఆంధ్ర : తాడిచర్ల గ్రామం కాపురం శివారులోని కరకల్ల రహదారిని ప్రభుత్వ పాత నక్ష (రెవెన్యూ మ్యాప్) ప్రకారంగా గుర్తించి, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ శుక్రవారం తాడిచర్ల గ్రామ రైతులు అందరూ కలిసి మల్హర్ రావు మండల తహసీల్దార్ కె. రవి కుమార్ గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఈ కరకల్ల రోడ్డు మార్గం కాలక్రమేణా పాత నక్ష ప్రకారం కనుమరుగైపోయిందని, సరిహద్దులు స్పష్టంగా లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల రోడ్డు మొత్తం లోతైన గుంతలతో, పూర్తిగా బురదమయంగా మారిపోయిందని తెలిపారు. దీనివల్ల నిత్యం వందలాది మంది రైతులు, కూలీలు మరియు పశువుల కాపరులు తమ పంట పొలాలకు వెళ్లడానికి నరకయాతన అనుభవిస్తున్నారని, కనీసం నడవడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొందని వివరించారు.కావున రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, పాత నక్ష ప్రకారం ఈ రహదారి సరిహద్దులను సర్వే చేయించి గుర్తించాలని, బురద రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రైతులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిచర్ల గ్రామ రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్‌పై డీలర్లకు అవగాహన కల్పించిన మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ

సిర్గాపూర్ ఆగస్ట్ 7 విజన్ ఆంధ్ర : సిర్గాపూర్ మండల వ్యవసాయ అధికారి జి. హరికృష్ణ మండలంలోని ఎరువుల విక్రయ కేంద్రాలను సందర్శించి, రైతులు మరియు ఎరువుల డీలర్లకు ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్ (ఫీఫీ) యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఎరువుల కొనుగోలు, విక్రయాలు ఇకపై ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారానే నమోదు చేయాలని, ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీలర్లకు సూచించారు. యాప్ ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని హరికృష్ణ తెలిపారు.

## బీజేపీ చేనేత సెల్ జిల్లా కన్వీనర్‌గా అచ్చుగట్ల స్వామి నియామకం

మహబూబ్‌నగర్, అర్బన్ ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర): భారతీయ జనతా పార్టీ చేనేత సెల్ జిల్లా కన్వీనర్‌గా అచ్చుగట్ల స్వామిని, కో-కన్వీనర్‌గా టంకసాల భారత్ కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ రెడ్డి వారిద్దరినీ శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అచ్చుగట్ల స్వామి మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ బలోపేతం, చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అచ్చుగట్ల అంజయ్య, జిల్లా ఆఫీస్ కార్యదర్శి జాజం సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మవేణి, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరన్న, గడిగే అంజయ్య, కొల్లె శంకర్, కాసా లక్ష్మీనారాయణ, మల్లేష్, వన్నాడ బస్వరాజ్ పాల్గొన్నారు.



# కూచనపల్లి--మాలపల్లి వంతెనకు రూ.3 కోట్ల నిధులు..

**మడప పద్మ జైపాల్ రెడ్డి కూచనపల్లి గ్రామ సర్పంచ్**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగస్టు7 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచనపల్లి,మాలపల్లి గ్రామాల మధ్య వాగుపై వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పాటు బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమానాలు మంజూరు చేయించడంలో గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి.రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ గ్రామ ప్రజలు ఆనందోత్సాహాలతో కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ సర్పంచ్ మడప పద్మ జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మామిడి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ ఆయన చొరవతో గ్రామ ప్రజల చిరకాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ మడప పద్మ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, కూచనపల్లి--మాలపల్లి గ్రామాల మధ్య వాగుపై వంతెన లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడంలో, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడంలో, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు పొందడంలో ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చేదని పేర్కొన్నారు.ఏళ్ల తరబడి పలువురు ప్రజాప్రతినిధులు, గత ప్రభుత్వాల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని, అయితే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమస్యను వివరించగానే వెంటనే స్పందించి రూ.3 కోట్లతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం ఆయన ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కొనియాడారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్నె రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నూతన పెంట్లవెల్లి మండల విద్యాశాఖ అధికారిగా, జీవన్ కుమార్

**- మండల ఉపాధ్యాయులను కలుపుకొని పనిచేస్తా,**

**- విద్యార్థుల అత్యధిక రిజల్ట్స్ రావడానికి కలిసి పనిచేద్దాం**

**- పెంట్లవెల్లి నూతన మండల విద్యాశాఖ అధికారి జీవన్ కుమార్**

పెంట్లవెల్లి, ఆగస్టు 7: (విజన్ ఆంధ్ర) : నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం నూతన మండల ఎంఈఓగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన జీవన్ కుమార్ ను పెంట్లవెల్లి మండల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నోడల్ ఆఫీసర్ కురుమయ్య ఆధ్వర్యంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్పీలు, ఇతర అధికారులు ఘనంగా శాలువా పూలమాలతో స్వాగతించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ప్రధాన ఉపాధ్యాయుడు కురుమయ్య మాట్లాడుతూ, పెంట్లవెల్లి మండలం ప్రశాంత వాతావరణంగా ఉంటుందని ఇక్కడి ఉపాధ్యాయులు ఎంఈఓకు పూర్తిగా సహకరించమని హామీ ఇచ్చారు. వారు ఎంఈఓ సూచనల్ని తప్పకుండా అమలు చేసి మండలంలో విద్యార్థుల రిజల్ట్ అత్యధికంగా రావడానికి కలిసి పనిచేస్తామన్నారు.

సంతకం చేసి బాధ్యతలు చేపట్టిన నూతన పెంట్లవెల్లి ఎంఈఓ జీవన్ కుమార్ తన పనీ అనుభవాన్ని, విద్యా దృష్టిని పంచుకున్నారు. 1996 నుంచి 1997 మార్చి వరకు ఆయన తన కెరీర్‌ను తెలియజేసి తొలిసారిగా అమ్రాబాద్ మండలంలోని మాధవన్ పల్లి యుపిఎస్‌లో మొదటి తరగతి క్లాస్ టీచర్‌గా తన ప్రస్తావనం మొదలు పెట్టినట్టు పేర్కొన్నారు. ఆయన తన పూర్తి విద్యాభ్యాసాన్ని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో పూర్తిచేశానని, ఒక రెండు సంవత్సరాలు సమ్మెల్ సాగర్‌లో చదివానని వివరించారు. తరువాత అమ్రాబాద్, ఉప్పునుంతల, బల్మూరు, అచ్చంపేట వంటి వివిధ మండలాల్లో ప్రధానోపాధ్యాయులుగా, నోడల్ ఆఫీసర్ తో పాటు మండల ఎంఈఓలుగా విధులు నిర్వహిస్తూ సేవానుభవం సంపాదించానని చెప్పారు. అలాగే ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూ విద్యార్థులకు మంచి విద్య,, క్రమశిక్షణను అందించడమే నా ప్రధాన లక్ష్యం. నేను ఎక్కడికి వెళ్ళినా అక్కడ ఉన్న ఉపాధ్యాయులతో కలిసి కార్యనిర్వహణతో పనిచేసే శైలి కొనసాగించాను. ఒకసారి అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో ఉండటం వల్ల కలెక్టర్ మీటింగ్‌కు హాజరు కాలేకపోవడం కారణంగా సస్పెండ్ అయినప్పటికీ పనిష్మెంట్ కింద ఈ పెంట్లవెల్లి మండల ఎంఈఓగా ఇచ్చారని, అది నేను పనిష్మెంట్ గా అనుకోనని బాధ్యతగా తీసుకొని ఇక్కడ ఉన్న ఉపాధ్యాయులను కలుపుకొని మరింత ఎక్కువ పనిచేయటం కోసం కృషి చేస్తానని చెప్పారు. తన కుటుంబం బాగుందన్నారు.కుమారుడు ఇంజనీరింగ్ లో, ఐఐటీ స్థాయిలో ఆల్ ఇండియా 324వ ర్యాంకు సాధించడం వంటి విజయాలతో కుటుంబాన్ని గర్వపడే స్థితిలోకి తీసుకొచ్చాడని చెప్పారు; కూతురు ఎంబిబిఎస్ పూర్తి చేసి పీజీ చేసుకుంటుందని తెలిపారు. చివరగా పెంట్లవెల్లి మండలంలో ఉన్న పాఠశాలలో విద్యార్థుల అత్యధిక రిజల్ట్స్ రావడమే మా లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పెంట్లవెల్లి ఉన్నత ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ బృందం సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులతో ఉమామహేశ్వర కాలనీకి కొత్త రూపు

**-కొంపల్లి అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నాం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

**-భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు**

**-బోనాల సందర్భంగా నల్ల పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**-ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కాలనీవాసులు**

కొంపల్లి, ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర); కొంపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉమామహేశ్వర కాలనీ అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం సీఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధిలోని ఉమామహేశ్వర కాలనీలో ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, సీసీ రోడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే వెంటనే



స్పందించి భూగర్భ డ్రైనేజీతో పాటు సీసీ రోడ్ల నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, ఉమామహేశ్వర కాలనీలో అధిక సంఖ్యలో నిరుపేద కుటుంబాలు నివసిస్తున్నాయని, గత 12 సంవత్సరాలుగా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇచ్చిందని, రానున్న రోజుల్లో కూడా అన్ని సౌకర్యాలతో కాలనీని ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు బోనాల పండుగను పురస్కరించుకుని ఉమామహేశ్వర కాలనీలోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. స్థానిక ప్రజల సుఖశాంతులు, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ లావణ్య, డీఈలు స్మార్ట్, తిరుపతి, మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవిత శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వినోద్, మహిళా అధ్యక్షురాలు సంగీతారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు షేక్ రియాజుద్దీన్, నాయకులు షన్ను, కాలనీ జనరల్ సెక్రటరీ రాధా, కాలనీవాసులు వెంకటయ్య, రాజిరెడ్డి వెంకటరాజు, మహేష్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# 'ఎలాగైనా నా భర్తను చంపు..

## లేదంటే నేను చనిపోతా'

### -భార్య చాటింగ్‌తో షాక్‌కు గురైన భర్త..

### - డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్

మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 7 ( విజన్ ఆంధ్ర ) డోర్నకల్: భర్తను హత్య చేయాలని ప్రియుడిని కోరుతూ భార్య పంపినట్లు చెబుతున్న వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సందేశాలు వెలుగులోకి రావడం కలకలం రేపింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో వెలుగుచూసింది.

చిలుకోడుకు చెందిన గాదె రాజేశ్వరరావుకు 2016లో సూర్యాపేట జిల్లాకు చెందిన భవానితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే తన భార్య భవానికి సైదులు అనే కొరియర్ బాయ్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు రాజేశ్వరరావు ఆరోపించారు.

ఈ విషయం గత నెల 27న తనకు తెలియడంతో రాజేశ్వరరావు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం తన అన్నను తీసుకురావడానికి వెళ్తున్న సమయంలో సైదులు తనను వెంబడించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని నుంచి తప్పించుకుని ఇంటికి తిరిగి వచ్చిన రాజేశ్వరరావు.. తన భార్య ఫోన్‌ను పరిశీలించినట్లు తెలిపారు. అందులో తనను ఎలాగైనా చంపాలని, లేదంటే తాను చనిపోతానని భవాని సైదులుకు పంపినట్లు చెబుతున్న సందేశాలను గుర్తించినట్లు రాజేశ్వరరావు పేర్కొన్నారు.

# కిసాన్ మోర్చా మండల అధ్యక్షుల నియామకపత్రం అందజేసిన మేడపాటి...

బోధన్, ఆగస్టు 07(విజన్ ఆంధ్ర) : బోధన్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు నూతనంగా నియామకం చేపట్టిన కిసాన్ మోర్చా మండల అధ్యక్షులకు శుక్రవారం ఎంపీఆర్ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి వడ్డీ మోహన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిరుపతి రెడ్డి ల చేతుల మీదుగా నియామాక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను రైతులకు చేరవేయడంతో పాటు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కిసాన్ మోర్చా పార్టీకి ఎంతో కీలకమైన విభాగమని, గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు రైతులతో నిరంతరం మమేకమై పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులు



తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రాంచందర్, జిల్లా కార్యదర్శి, ఐటీ ఇంచార్జి పిల్లి శ్రీకాంత్, జిల్లా నాయకులు శ్రీధర్, మనోహర్, వివిధ మండలాల అధ్యక్షులు గోపీకిషన్, ఇంద్రకరణ్, గంగాధర్, యోగేష్, సరిన్, సుదర్శన్, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారుఠ

# మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

పెబ్బేరు ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర ) పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక పెబ్బేరు మోడల్ స్కూల్ ప్రాంగణంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ గణేష్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్ సాగర్‌లతో కలిసి ఆయన మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించాలంటే పచ్చదనాన్ని పెంపొందించడం ఒక్కటే మార్గమన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే పర్యావరణ స్పృహ కలిగి ఉండాలని, నాటిన ప్రతి ఒక్క మొక్కనూ బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనం పెంపునకు, మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ గణేష్ తెలిపారు.

పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్ సాగర్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు



ఎంతగానో తోడ్పడతాయని, ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకుని పెంచేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

?ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ జ్యోతి, ఉపాధ్యాయ బృందం, మున్సిపాలిటీ సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమంలో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.

# క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ డిప్లమా విద్యార్థులకు ఘనంగా ఓరియంటేషన్ కార్యక్రమం...

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ మండలంలోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో 2026. 2027 విద్యాసంవత్సరంలో ప్రవేశం పొందిన బీటెక్ ప్రథమ సంవత్సరం డిప్లమా విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమం ప్రారంభంలో కళాశాల అధ్యాపకులు వివిధ విభాగాల అధిపతుల ను వేదిక పైకి ఆహ్వానించారు

బీటెక్ ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థిని మరియు శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో అతిథులను విద్యార్థులను ఆకట్టుకున్నారు అతిథుల తో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. కటకం శ్రీనివాస్ గారు మాట్లాడుతూ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు అత్యధిక ప్రయోగశాలలు కేంద్ర గ్రంథాలయం డిజిటల్ అభ్యాస సౌకర్యాలు క్రీడా వసతులు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు పరిశ్రమలతో అనుసంధానమైన శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల



భవిష్యత్తు నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ప్రతి సంవత్సరం విద్యార్థి సాయి సిద్ధార్థ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని మహంతి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన చతుర్ధ విద్యార్థి శివం జాతీయ విద్యార్థి దలం తరుపున మెకానికల్ విభాగానికి చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థి విఙ్షేశ్వర వర్మ ద్వితీయ సంవత్సరం విద్యార్థి నోమన్ ఉద్దీన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన చతుర్ధ సంవత్సర విద్యార్థిని శ్రీజ సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన చతుర్ధ సంవత్సరం విద్యార్థిని ఏం రమణ తమ అనుభవాలను పంచుకొని ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించాలని లక్ష్యంతో క్షత్రియ విద్యాసంస్థలు నిరంతరం ముందుకు సాగుతున్నాయని తెలిపారు విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని అందుకే అత్యుత్తమ విద్య ప్రమాణాలు అణువణులైన అధ్యాపకులు ఆధునిక మౌలిక వసతులు పరిశ్రమలు అనుకూలమైన శిక్షణ కార్యక్రమాలను కళాశాలలో అందుబాటులో ఉంచామని అన్నారు కళాశాల కార్యదర్శి మరియు ప్రతినిధి అల్జాపూర్ దేవేందర్ గారు కళాశాల కోశాధికారి గంగాధర్ గారు కళాశాల సంచాలకులు అల్జాపూర్ వీరేందర్ ప్రిన్సిపాల్ డా. కే. శ్రీనివాస్ గారు కళాశాల పరిపాలన అధికారి బి నరేందర్ సమన్వయకర్త శ్రీమతి స్వప్న గారు నియామక అధికారి శ్రీ సునీల్ గారు.

సమన్వయకర్త సుజిత్ గారు సామాజిక మద్యమాల బాధ్యులు జాతీయ విద్యార్థి దళం బాధ్యులు అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పెబ్బేరుఆగస్టు 7( విజన్ ఆంధ్ర ) స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను సందర్శించిన ఆయన, వంటగదిలోని పరిశుభ్రతను, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా మధ్యాహ్న భోజనం వడ్డించారు. విద్యార్థులతో ముచ్చటించి, వారికి ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందుతోందో లేదో అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ శుచి, రుచికరమైన ఆహారాన్ని అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ విద్యార్థులకు వడ్డించే ముందు భోజన నాణ్యతను తనిఖీ చేయాలని సూచించారు. వంట పాత్రలు, వంట ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోద్ ని, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, మండల విద్యాధికారి జయరాములు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహా గౌడ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి

### - డీఎల్పీఓ ప్రభాకర్

నార్నూర్, ఆగస్టు 7విజన్ ఆంధ్ర):వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పారిశుద్ధ్యం,క్లోరినేషన్ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేయకుండా సమర్థవంతంగా అమలు చేయాలని డీఎల్పీఓ ప్రభాకర్ సూచించారు. శుక్రవారం నార్నూర్ మండల కేంద్రంలోని మైనార్టీ వార్డు, అంబేద్కర్ నగర్, దుర్గా నగర్ కాలనీల్లో ఆయన విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, క్లోరినేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వీధులు, కాలువల పరిశుభ్రత, తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ చర్యలపై సంబంధిత సిబ్బందిని ఆరా తీశారు. ప్రజారోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ బానోత్ కావేరి, ఉపసర్పంచ్ మహమ్మద్ ఖురేషి, దళిత అవార్డు గ్రహీత కొర్రెల్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ సెట్విన్ లో ఘనంగా ఆషాఢ బోనాల వేడుకలు ...

మక్తల్,ఆగస్టు 7 విజన్ ఆంధ్ర : తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సంప్రదాయ పండుగ బోనాలు.. మక్తల్ సెట్విన్ కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిపై భక్తి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని ప్రతిబింబించే ఈ వేడుకల్లో బోనాలు తయారు చేసి, నైవేద్యం వండుకుని తీసుకువచ్చి విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించుకొని, పసుపు-కుంకుమలతో అలంకరించిన బోనం పాత్రలను తలపై మోసుకుంటూ అమ్మవారికి సమర్పించారు. సెట్విన్ మక్తల్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, బోనాలు పండుగ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులు సంప్రదాయాలను కాపాడుతూ, భక్తి భావంతో పాల్గొనడం



ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్ చార్జి తిమ్మన్న, మగ్గం వర్క్ ట్రైయినర్ వీరమ్మ, టైలరింగ్ ట్రైనర్ ఫర్హానా బేగం, బ్యుటీషియన్ ట్రైనర్ స్వప్న , సిబ్బంది ప్రవీణ్, లక్ష్మి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయిలు వెంటనే విడుదల చేయాలి: బీజేవైఎం

చేవెళ్ల, ఆగస్టు 07 (విజన్ ఆంధ్ర): తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని బీజేవైఎం నాయకులు కోరారు. బీజేపీ యువ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కుందే గణేష్ పిలుపు మేరకు శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల వివేకానంద జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో "ఫీజుల బకాయి - బీజేపీ లడాయి" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో 40 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం బీజేవైఎం పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో



బీజేపీ ఎస్సీ మోర్చా కార్యదర్శి అర్రవల్లి అశోక్, బీజేవైఎం నాయకులు వడ్డే గణేష్, బండారి చంద్రశేఖర్ రెడ్డి, అల్లాడ అభిషేకర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖాడోడి గ్రామంలో భూ భారతి రీ సర్వే

గాదిగూడ, ఆగస్టు 7(విజన్ ఆంధ్ర):రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని ఖాడోడి గ్రామపంచాయతీలో భూభారతి రీ సర్వే చేపట్టారు. శుక్రవారం మండల అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. పైలట్ ప్రాజెక్టు కింద గ్రామంలో భూభారతి రీసర్వే చేపట్టనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ విలాస్ తెలిపారు. ఆధునిక సాంకేతిక ద్వారా నిర్వహించే రీసర్వే ద్వారా సరిహద్దు తగాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. పారదర్శకమైన భూ రికార్డులతో ప్రతి ఒక్కరికి తమ భూమిపై స్పష్టమైన హక్కులు లభిస్తాయని,ఈ ప్రక్రియకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గేడం అమృత్ రావ్,ఆర్ఐ ప్రభావతి,రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ వేడుకలు

### - బాధ్యతలను స్వీకరించిన విద్యార్థి భావి నాయకులు
### - ముఖ్యఅతిథిగా పాల్గొన్న తాండూరు డి.ఎస్.పి నర్సింగ్ యాదయ్య

తాండూరు ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర ) తాండూరు పట్టణంలోని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్లో 2026--2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్వెస్టిచర్ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు బాధ్యతలు అప్పగించి, నాయకత్వం, క్రమశిక్షణ, సేవాభావం మరియు బాధ్యతాయుతమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించే సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి తాండూరు డి.ఎస్.పి నర్సింగ్ యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 2026--2027 విద్యా సంవత్సరానికి ఎన్నికైన విద్యార్థి మంత్రివర్గాన్ని అధికారికంగా పరిచయం చేశారు. స్కూల్ క్యాబినెట్ హెడ్ బాయ్: చరణ్ సాయి (10వ తరగతి)డిప్యూటీ హెడ్ బాయ్: సాకేత్ (10వ తరగతి)
హెడ్ గర్ల్: లక్ష్మీ ప్రసన్న (10వ తరగతి) డిప్యూటీ హెడ్ గర్ల్: వర్ధిని (10వ తరగతి) డిపార్ట్‌మెంట్ క్యాబినెట్ లెటరేచర్,కెప్టెన్ - మనీదీప వైస్ కెప్టెన్ - శ్రీజ కల్చరల్,కెప్టెన్ - సాయి నందిత పటేల్, వైస్ కెప్టెన్ - హారిణి, డిసిప్లిన్ కెప్టెన్ - హర్షిత
వైస్ కెప్టెన్ - శృతి, స్పోర్ట్స్ కెప్టెన్ - శ్రీ చందన



వైస్ కెప్టెన్ - టి. సాత్విక హౌస్ నాయకత్వం
స్వామి వివేకానంద (రెడ్ హౌస్) కెప్టెన్ - జి. స్తృతిక వైస్ కెప్టెన్ - - లక్ష్మీ ప్రియ సర్దార్ వల్లభభాయ్ పటేల్ (ఎల్లో హౌస్) కెప్టెన్ - బి. ప్రణతి వైస్ కెప్టెన్ - హుమేరా ఫాతిమా సుభాష్ చంద్రబోస్ (బ్లూ హౌస్) కెప్టెన్ - ఎన్. సహస్ర వైస్ కెప్టెన్ - ప్రణవి భగత్ సింగ్ (గ్రీన్ హౌస్) కెప్టెన్ - బి. ఆరోషి వైస్ కెప్టెన్ - ఆరాధ్య బ్యాడ్జీలు - శాష్‌ల ప్రదానం, నూతనంగా ఎన్నికైన స్కూల్ క్యాబినెట్ మరియు హౌస్ నాయకులకు ముఖ్య అతిథి డి.ఎస్.పి నర్సింగ్ యాదయ్య, స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు పాఠశాల గౌరవాన్ని కాపాడుతూ, నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యతతో తమ విధులను నిర్వహిస్తామని ఘనంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ముఖ్య అతిథి, పాఠశాల యాజమాన్యం, గౌరవ అతిథులు నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు, శాష్‌లను ధరింపజేసి అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా నాయకత్వం, క్రమశిక్షణ, బాధ్యత మరియు సేవాభావానికి ప్రతీకగా విద్యార్థులు తమ బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు. విద్యార్థి నాయకులను హెచ్.ఎం ఢ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రశాంత్ సార్, డైరెక్టర్లు శ్రీ సతీష్ సార్, శ్రీ వెంకటేశం సార్, శ్రీ మల్లేశం సార్, కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథి డి.ఎస్.పి నర్సింగ్ యాదయ్య మాట్లాడుతూ తన ప్రేరణాత్మక ప్రసంగంలో విద్యార్థులు మంచి విలువలు, క్రమశిక్షణ, నిజాయితీతో సమాజానికి ఆదర్శప్రాయ నాయకులుగా ఎదగాలని సూచించారు.
హెచ్.ఎం ఢ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రశాంత్ సార్ విద్యార్థి నాయకులను అభినందిస్తూ, నిజమైన నాయకత్వం సేవ, వినయం, క్రమశిక్షణ మరియు జట్టుగా పనిచేసే తత్వంలోనే ఉంటుందని వివరించారు.
హెడ్ బాయ్ - హెడ్ గర్ల్ సందేశాలు: కవాతు అనంతరం హెడ్ బాయ్ చరణ్ సాయి మరియు హెడ్ గర్ల్ లక్ష్మీ ప్రసన్న సభను ఉద్దేశించి ప్రసంగించారు. వారు తమపై ఉంచిన నమ్మకానికి ముఖ్య అతిథి, యాజమాన్యం, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల విలువలను కాపాడుతూ నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతో నాయకత్వ బాధ్యతలను నిర్వర్తిస్తామని హామీ ఇచ్చారు. తోటి విద్యార్థులు ఐకమత్యంతో ముందుకు సాగి విద్యా, క్రీడా మరియు సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు.



నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

## సంజీవయ్య నగర్ బోనాల వేడుకల్లో ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర): సంజీవయ్య నగర్‌లోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి, జె. విజయ్ గుప్త, పెంటని ఉమామహేశ్వర్, జాలూరి వీరేందర్ గుప్త, దాస్, కనకయ్య, కృష్ణచారి, గంగాధర్, విజయ్, శ్రీధర్, దుర్గాపతి, రాజుతో పాటు నియోజకవర్గ యువజన అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, రాకేష్ జాలిగం, అజయ్, సిద్దులు, నసీరుద్దీన్, నగేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంటీఏఆర్ టెక్నాలజీస్‌లో తొలగించిన ఫిక్స్‌డ్ టర్మ్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి: సీఐటీయూ

-షాపూర్‌నగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ
-15 ఏళ్లుగా పనిచేస్తున్న 350 మంది కార్మికులకు శాశ్వత ఉద్యోగాల కల్పన డిమాండ్
-కార్మిక చట్టాలను అమలు చేయకుండా యాజమాన్యం నిరంకుశ వైఖరి అవలంబిస్తోందని ఆరోపణ
-ఆందోళన చేసిన కార్మికుల తొలగింపు ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనేనని విమర్శ
-కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ హెచ్చరిక
-జిల్లాలోని అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం



కుత్బుల్లాపూర్, ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర); గాంధీనగర్ పారిశ్రామికవాడలోని ఎంటీఏఆర్ టెక్నాలజీస్ సంస్థలో అక్రమంగా విధుల నుంచి తొలగించిన ఫిక్స్‌డ్ టర్మ్ కార్మికులను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకుని, వారికి శాశ్వత ఉద్యోగ హోదా కల్పించాలని సీఐటీయూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి ఉషోదయ టవర్స్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలగింపునకు గురైన ఫిక్స్‌డ్ టర్మ్ కార్మికులకు సంఘీభావంగా నిర్వహించిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలపురం రాజశేఖర్, కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుగాని లక్ష్మణ్ మాట్లాడుతూ, ఎంటీఏఆర్ టెక్నాలజీస్‌లో గత 10 నుంచి 15 సంవత్సరాలుగా సుమారు 350 మంది ఐటీఐ, డిప్లొమా విద్యార్హత కలిగిన కార్మికులు ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని తెలిపారు. అయితే వారికి ఉద్యోగ భద్రత కల్పించకుండా, పదేపదే ఒప్పందాలను పునరుద్ధరిస్తూ శాశ్వత ఉద్యోగ హోదా ఇవ్వకుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. దీంతో కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఫిక్స్‌డ్ టర్మ్ కార్మికులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో గత ఎనిమిది రోజులుగా ఆందోళన చేస్తున్న కార్మికులను అకారణంగా విధుల నుంచి తొలగించడం, సెటిల్‌మెంట్ పేరుతో నోటీసులు జారీ చేయడం కార్మిక హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నాలను సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. యాజమాన్యం వెంటనే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకుని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, లేనిపక్షంలో జిల్లాలోని అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బొడిగె లింగస్వామి, దేవదానం, కే. శ్రీను, పసుల అంజయ్య, తిమ్మప్ప, కరుణాకర్, భాషా, యాదవ రెడ్డి, ఆంజనేయులు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో డాక్టర్లుగా చలామణి అవుతున్న ఆర్ఎంపీలు

టేక్మాల్ ఆగస్టు 7: (విజన్ ఆంధ్ర) అర్హత కలిగిన డాక్టర్ల కంటే ఆర్ఎంపీ డాక్టర్లు ఎక్కువ వారి సంపాదన కూడా రూ,,లక్షలు వెచ్చించి వైద్య విద్య చేసిన ఎంబిబిఎస్ డాక్టర్ల కంటే కూడా రెండు రెట్లు అధికంగా సంపాదిస్తున్నారని చర్చ వినిపిస్తుంది ఇక టేక్మాల్ మండల వ్యాప్తంగా ఆర్ఎంపీలు మోతాదుకు మించి రోగులకు మందులు ఇస్తున్నారు రోగి త్వరగా కోలుకోవడానికి చికిత్స పద్ధతులకు విరుద్ధంగా ఓవర్ డోస్ ట్రీట్మెంట్ ఇస్తున్నారు, విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ తో పాటు ఏకంగా స్టెరాయిడ్స్ ఇస్తుండటం ఆందోళన కలిగిస్తుంది. దీనివలన మూత్రపిండాలు ఊపిరితిత్తుల సమస్యలు ఎదురవుతున్నాయి చిన్న చిన్న సర్జరీలు చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు తరచు తనిఖీలు చేపట్టకపోవడం మొక్కుబడిగా దాడులు చేయడం వల్ల ఈ అక్రమ వైద్యం యదేచ్చగా కొనసాగుతుంది ఇంత జరుగుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్లు ఉంటున్నారని విమర్శలు వస్తున్నాయి ఇకనైనా సంబంధిత అధికారులు తనిఖీలు చేసి ఆర్ఎంపి డాక్టర్ల నుండి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు

# పోచమ్మ దేవతకు ఒడిబియ్యం సమర్పించిన లాల్ కృష్ణ ప్రసాద్ దంపతులు

పరిగి, ఆగస్టు07(విజన్ ఆంధ్ర): పరిగి మండలం జాఫర్‌పల్లి గ్రామంలో పోచమ్మ బోనాల సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణ ప్రసాద్, ఆయన సతీమణి పద్మ, కుమారుడు విఘ్నేష్ ఆధ్వర్యంలో పోచమ్మ దేవతకు భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం సమర్పించారు. గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. పోచమ్మ బోనాల వేడుకలు గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయని, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ కుమార్, ఉప సర్పంచ్ అంజయ్య, వార్డు సభ్యులు భారతమ్మ, శ్రీనివాస్, సత్తయ్య, లలిత, పెంటయ్య, గ్రామ పెద్దలు కురువ రామచంద్రయ్య, వెంకటయ్య, గంగ శీను, జంగయ్య, శివకుమార్, రాకేష్, వి. నర్సింలు, రమేష్, శ్రీనివాస్, గంగ అంజయ్య, మల్లేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫేక్ ఫైర్ ఎన్‌వోసీ స్కాంపై యూఎస్ఎఫ్ఐ ఆగ్రహం



- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
-హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ ఎన్‌వోసీలు జారీ చేశారంటూ ఆరోపణలు
- 180 కళాశాలల నుంచి రూ.10.80 కోట్ల వసూళ్లపై సమగ్ర విచారణ కోరిన యూఎస్ఎఫ్ఐ
- నకిలీ పత్రాలు సమర్పించిన కళాశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలల్లో మూడో పక్షంతో ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని విజ్ఞప్తి
- ఏడు రోజుల్లో చర్యలు లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిక

కుత్బుల్లాపూర్, ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర); హైడ్రా అధికారుల పేరును దుర్వినియోగం చేస్తూ ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలకు నకిలీ ఫైర్ ఎన్‌వోసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికేట్) పత్రాలు సమర్పించినట్లు వెలుగులోకి వచ్చిన వ్యవహారాన్ని యూఎస్ఎఫ్ఐ (యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటన విద్యార్థుల ప్రాణ భద్రతను సైతం ప్రమాదంలోకి నెట్టిందని సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, ఇది సాధారణ అవినీతి కాదని, విద్యార్థుల ప్రాణాలతో ముడిపడిన అత్యంత తీవ్రమైన వ్యవహారమని పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఫైర్ ఎన్‌వోసీలు సృష్టించడం ప్రభుత్వ వ్యవస్థల్లోని లోపాలను బయటపెడుతోందని ఆరోపించారు. స్కాంలో భాగంగా సుమారు 180 ప్రైవేట్ కళాశాలల నుంచి ఒక్కో కళాశాలకు రూ.6 లక్షల చొప్పున మొత్తం రూ.10.80 కోట్లు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు వంటి కనీస భద్రతా ప్రమాణాలు లేకుండానే నకిలీ ఎన్‌వోసీలు జారీ చేయడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత శాఖల అధికారుల పాత్రపైనా సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని ఎం. చంద్రకాంత్ అభిప్రాయపడ్డారు. విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించరాదని ఆయన స్పష్టం చేశారు. విద్యారంగంలో సంస్కరణలు వేగవంతం చేయాలని, విద్యాసంస్థల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

యూఎస్ఎఫ్ఐ ప్రధాన డిమాండ్లు

నకిలీ ఫైర్ ఎన్‌వోసీలు సమర్పించిన కళాశాలలపై తక్షణ చర్యలు తీసుకుని గుర్తింపును రద్దు చేయాలి.

స్కాంలో ప్రమేయం ఉన్న అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలి.

రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో స్వతంత్ర మూడో పక్షంతో ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి.

బాధ్యుల నుంచి నష్టాన్ని వసూలు చేసి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలి.

లేక్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారించాలని యూఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఏడు రోజుల్లోగా తగిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల ముట్టడి, సచివాలయం ముట్టడి వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సంఘం హెచ్చరించింది.



## పోచమ్మ దేవతకు ఒడిబియ్యం సమర్పించిన లాల్ కృష్ణ ప్రసాద్ దంపతులు

పరిగి, ఆగస్టు07(విజన్ ఆంధ్ర): పరిగి మండలం జాఫర్‌పల్లి గ్రామంలో పోచమ్మ బోనాల సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణ ప్రసాద్, ఆయన సతీమణి పద్మ, కుమారుడు విఘ్నేష్ ఆధ్వర్యంలో పోచమ్మ దేవతకు భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం సమర్పించారు. గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. పోచమ్మ బోనాల వేడుకలు గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయని, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ కుమార్, ఉప సర్పంచ్ అంజయ్య, వార్డు సభ్యులు భారతమ్మ, శ్రీనివాస్, సత్తయ్య, లలిత, పెంటయ్య, గ్రామ పెద్దలు కురువ రామచంద్రయ్య, వెంకటయ్య, గంగ శీను, జంగయ్య, శివకుమార్, రాకేష్, వి. నర్సింలు, రమేష్, శ్రీనివాస్, గంగ అంజయ్య, మల్లేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ వారాన్ని పురస్కరించుకొని శ్రీ శ్రీ శ్రీ నవదుర్గ మాత ప్రత్యేక పూజలు

ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్.TNGO జిల్లా అధ్యక్షులు శ్రీ నాశెట్టి ఈశ్వర్ సుమన్ కుమార్ గారి దివ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు

నిజామాబాద్ ఆగస్టు07:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో శుక్రవారం రోజు ఇట్టి కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ , రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా సహాధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, కోశాధికారి నిరంజన్ గౌడ్, ఉపాధ్యక్షులు సంజీవయ్య, జాఫర్ హుస్సేన్, పద్మ ,అర్బన్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్, గురుచరణ్, స్వామి, విజయలక్ష్మి, మంగమ్మ, గీతారెడ్డి, శరణ్య టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్ వివిధ శాఖల ఉద్యోగులు జిల్లా ప్రజలు హాజరై జగన్మాత కృపకు పాత్రులైనారు

# ఉన్నత విద్యకు చేయూత..

## కమల్ గౌడ్‌కు రూ.60 వేల ఆర్థిక సహాయం అందించిన బీఆర్ఎస్ నాయకులు



చారకొండ,ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర):చారకొండ మండలంలోని గోకారం గ్రామానికి చెందిన విద్యార్థి బాధగోని కమల్ గౌడ్ ఉన్నత విద్యాభ్యాసానికి పలువురు ప్రజాప్రతినిధులు,నాయకులు ముందుకొచ్చి రూ.60 వేల ఆర్థిక సహాయం అందించారు.

కమల్ గౌడ్ తండ్రి బాధగోని జంగయ్య చేసిన విజ్ఞప్తికి స్పందించిన వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు రూ.30 వేలు,చారకొండ సర్పంచ్ గుండె విజయేందర్ గౌడ్ రూ.20 వేలు,మాజీ ఎంపీటీసీ గోపిడి శ్రీనివాస్ రెడ్డి రూ.10 వేలు అందజేశారు.ఈ ఆర్థిక సహాయం కమల్ గౌడ్ ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఈ సందర్భంగా తమ విజ్ఞప్తికి స్పందించి ఉదారంగా సహాయం అందించిన దాతలకు బాధగోని జంగయ్య కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ముందుకొచ్చి చేయూతనందించిన వారి సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో సహకరించిన బీఆర్ఎస్ నాయకుడు పగడాల ఆంజనేయులు,గోకారం బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు సాయి సేవలను కూడా కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందిస్తూ వారికి ధన్యవాదాలు తెలిపారు.కమల్ గౌడ్ ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు.

## గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

### - బెల్లంకొండ వెంకటేశ్వర్లు

చారకొండ,ఆగస్టు7 (విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో "సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో -- గీతన్నల చైతన్య బస్సు యాత్ర" శుక్రవారం చారకొండ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఏజెన్సీ ప్రాంతాల్లో వృత్తి నిర్వహిస్తున్న గీత కార్మికులందరికీ సభ్యత్వాలు కల్పించి, సొసైటీలు,టీఎఫ్‌టీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు.

ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమిని కేటాయించి, కోటి వృక్షాల పథకం కింద కల్లు సొసైటీల భూములకు ఫెన్సింగ్, నీటి సౌకర్యం కల్పించి తాటి, ఈత, ఖర్జూర మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే



గీత కార్మికులకు 'కాటమయ్య రక్షణ కవచం'అందించి,వాటి వినియోగంపై అవగాహన కల్పించాలని, 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలని, ప్రమాదాల్లో మృతి చెందిన లేదా గాయపడిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు చింతపల్లి అశోక్ గౌడ్,సవారి జంగయ్య గౌడ్, గుండె వివ గౌడ్,చింతపల్లి చండీశ్వర్, జూలూరి అర్జునయ్య గౌడ్,గోకారం నుండి వెంకటేశ్వర్లు,సుధాకర్,గజ్జ శ్రీనివాస్ గౌడ్, రాంపురం,తుర్కలపల్లి గ్రామాలకు చెందిన గీత కార్మికులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

### - రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

నిజామాబాద్, ఆగస్టు 07 :( విజన్ ఆంధ్ర ) : ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు తక్కువ నీటి అవసరంతో ఎక్కువ దిగుబడి వచ్చే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వానాకాలం సాగు, వన మహోత్సవం, పంట కుంటలు, స్మార్ట్ రేషన్ కార్డుల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతులు వరి మినహా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలు సాగు చేసే విధంగా దృష్టి సారించాలని తెలిపారు. ఆ దిశగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాల వారీగా పరిశీలించగా 3 జిల్లాలలో అధిక వర్షపాతం, 21 జిల్లాలలో సాధారణ వర్షపాతం, 9 జిల్లాలలో లోటు వర్షపాతం నమోదయిందని, మండలాల వారీగా 126 మండలాలలో అధిక వర్షపాతం, 282 మండలాలలో సాధారణ వర్షపాతం, 205 మండలాలలో లోటు, 8 మండలాలలో భారీ లోటు వర్షపాతం నమోదయిందని తెలిపారు. భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ సాగు అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో వానాకాలం 2026 లో సాధారణ సాగు విస్తీర్ణంహాహా1 కోటి 32 లక్షల 38 వేల 714 ఎకరాల కాగా తుది సాగు విస్తీర్ణం 1 కోటి ఎనిమిది లక్షల 22 వేల 389 ఎకరాలుగా ఉందని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 99.81 లక్షల ఎకరాలలో పంటల సాగు జరిగిందని, పత్తి సుమారు 47.25 లక్షల ఎకరాలు, పప్పు ధాన్యాలు సుమారు 6.14 లక్షల ఎకరాలు, నూనె గింజలు సుమారు 3.76 లక్షల ఎకరాలు, చెరుకు సుమారు 38 వేల 149 ఎకరాలు, కూరగాయలు సుమారు 43 వేల 802 ఎకరాలలో సాగు జరుగుతుందని తెలిపారు. జూలై నెలలో నిర్వహించిన విత్తన మేళాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, 3 వేల 116 మంది రైతులు వివిధ పంటలకు సంబంధించిన విత్తనాలు కొనుగోలు చేశారని తెలిపారు. వానాకాలం సాగు అవసరాల కోసం గోదావరి, కృష్ణా బేసిన్లలోని ప్రాజెక్టుల ద్వారా సాగునీటి విడుదలకు కార్యాచరణ సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు.

**వన మహోత్సవం**

2026 వన మహోత్సవం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటి వరకు 6.28 కోట్ల మొక్కలు నాటడం/ పంపిణీ చేయడం ద్వారా 39 శాతం ప్రగతి సాధించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నర్సరీల్లో 16.29 కోట్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని, అవెన్యూ ప్లాంటేషన్ క్రింద 176.959 కిలోమీటర్ల మేర రహదారుల వెంట, కాలువ కట్టలు, చెరువుగట్లు, వ్యవసాయ భూముల కట్టల వెంట మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బ్లాక్ ప్లాంటేషన్ లో సామాజిక, వ్యవసాయ, చెరువు శిఖం, ప్రభుత్వ భూములు, స్మృతి వనాలు, డంపింగ్ యార్డు, స్మశాన వాటిక లలో, సంస్థాగత ప్లాంటేషన్ లో ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, కళాశాలలు, పాఠశాలలు, హౌసింగ్ కాలనీలు, ఆసుపత్రులు, ఇతర సంస్థలలో, ఇంటి ఆవరణలలో, పారిశ్రామిక ప్రాంతాలలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ క్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు మొక్కలు నాటేందుకు లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, నాటిన ప్రతి మొక్కను తప్పనిసరిగా ౦+ఢీఏఖా పోర్టల్‌లో జియో ట్యాగింగ్ చేసి, వాటి మనుగడ శాతాన్ని నిరంతరం నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

**సమగ్ర వ్యవసాయ క్షేత్ర చెరువులు**

స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సమగ్ర వ్యవసాయ క్షేత్ర చెరువుల పథకం పనులను వేగవంతం చేయాలని తెలిపారు. రాష్ట్రంలోని 31 జిల్లాలలో 13 వేల 46 క్షేత్ర చెరువుల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించగా ఈహాహానెల 15 నాటికి అన్ని పనులను ప్రారంభించి పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. "ఒకే చెరువు -- ఆరు రకాల జీవనోపాధులు" అనే భావనతో నీటిపారుదల, చేపల పెంపకం, పాడి పరిశ్రమ, కూరగాయల సాగు, పశు గ్రాస అభివృద్ధి, సేంద్రీయ ఎరువుల తయారీ వంటి కార్యక్రమాల ద్వారా మహిళా రైతుల ఆదాయాన్ని పెంచేలా శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని సూచించారు.

**స్మార్ట్ రేషన్ కార్డుల అమలు**

పౌర సరఫరాల వ్యవస్థను మరింత పారదర్శకంగా, భద్రతాయుతంగా మార్చేందుకు ప్రభుత్వం త...

## భారత రాజ్యాంగ స్ఫూర్తికి బీపీ మండల్ సేవలు చిరస్మరణీయం

**- గౌనికాడి రాములు యాదవ్**

**బీసీ కులాల ఐక్య వేదిక కన్వీనర్**



కొత్తకోట ఆగస్టు 07(విజన్ ఆంధ్ర): కొత్తకోట: వెనుకబడిన వర్గాల సామాజిక, విద్యా మరియు ఉద్యోగ అవకాశాల అభివృద్ధికి విశేష కృషి చేసిన బీపీ మండల్ గారి సేవలు భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు నాయకులు పేర్కొన్నారు. సామాజిక న్యాయం సాధన కోసం ఏర్పాటు చేసిన మండల్ కమిషన్ ద్వారా వెనుకబడిన వర్గాల పరిస్థితులను అధ్యయనం చేసి, వారికి విద్యా మరియు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని చేసిన సిఫారసులు దేశంలో సామాజిక సమానత్వానికి కొత్త దిశను చూపాయి. ఈ సందర్భంగా బీపీ మండల్ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో సమాన అవకాశాలు, సామాజిక న్యాయం మరియు రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వెంకటన్న గౌడ్ సత్యం యాదవ్ కొత్త గంగాధర్ ముదిరాజ్ శివ శంకర్ విజయ్ కుమార్ రామచంద్రయ్య శంకర్ బాల కొండయ్య రామస్వామి విజయ్ కుమార్ భాస్కర్ సాగర్ సామాజిక సంఘాల నాయకులు, యువజన ప్రతినిధులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి కనీస వేతనము 26,000 నిర్ణయించి ఇవ్వాలి

కొత్తకోట ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర): కొత్తకోట కాంగ్రెస్ ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం చెల్లిస్తామని రెండు సంవత్సరాలు గడిచిన అమలుకు నోచుకోలేదని ఆయన ఆరోపించారు మున్సిపల్ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి రెండో పిఆర్సిలో కనీస వేతనం 26000 రూపాయలుగా నిర్ణయించాలని సిఐటియు జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు శుక్రవారం నాడు కొత్తకోట మున్సిపల్ కార్యాలయంలో సిఐటియుఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎన్ ఎమ్ ఆర్ ఫిక్స్ పే తదితర మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి రెండో పి ఆర్ సి లో కనీస వేతనం 26,000 నిర్ణయించాలని మున్సిపల్ కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు కార్మికులకు రేయిన్ కోట్లు స్వెటర్లు సబ్బులు బట్టలు, కొబ్బరినూనె ఇతర సామాగ్రిని అందజేయాలని డిమాండ్ చేశారు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారి చదువు మరియు వృత్తి నైపుణ్యతను గుర్తించి జవాన్లుగా డ్రైవర్లుగా సానిటరీ ఇన్స్పెక్టర్లుగా కంప్యూటర్ ఆపరేటర్లుగా మొదటి ప్రాధాన్యత ఇచ్చి ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు పని ప్రదేశాల్లో రెస్టు రూములు ఏర్పాటు చేయాలని కార్మికులు మరణిస్తే దహన మట్టి ఖర్చులు 30000 ఇవ్వాలని ఆయన కోరారు ఈనెల 10న జరిగే జైల్ భరోధర్నా కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని చెప్పారుఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు జె శ్రీనివాసులు కార్యదర్శి శ్రీను రమేష్ కురుమన్న సత్య రెడ్డి మద్దిలేటి బుచ్చన్న ప్రసాదు సుశీల శిరీష సుగుణమ్మ పద్మ సరళ మన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ వైద్య కళాశాల ఉద్యోగాల భర్తీని పారదర్శకంగా నిర్వహించాలి

**- బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్**

వనపర్తి బ్యూరో ఆగస్టు 07 (విజన్ ఆంధ్ర ):వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాలలో హానరేరియం ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ వనపర్తి జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ డిమాండ్ చేశారు.

ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం నియామక ప్రక్రియలో ఎటువంటి పైరవీలు, సిఫార్సులు, రాజకీయ ఒత్తిళ్లు లేదా అవినీతికి తావు లేకుండా పూర్తిగా అర్హత, మెరిట్, నిబంధనల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆయన కోరారు.

నియామక ప్రక్రియలో పాల్గొనే ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించి, ఇంటర్వ్యూలు మరియు ధ్రువపత్రాల పరిశీలనను పారదర్శకంగా నిర్వహించాలని, ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితా, మార్కుల వివరాలను బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.



వైద్య విద్యా వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెంపొందించేందుకు ఈ నియామకాలు నిష్పాక్షికంగా జరగడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఏవైనా అవకతవకలు లేదా అక్రమాలు చోటుచేసుకుంటే భారతీయ జనతా పార్టీ తరపున ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ప్రజాధనం, ప్రభుత్వ సంస్థల విశ్వసనీయతను కాపాడే బాధ్యత అధికారులపై ఉందని, అందువల్ల నియామక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని భారతీయ జనతా పార్టీ వనపర్తి జిల్లా మీడియా కన్వీనర్ విజ్ఞప్తి చేశారు.

## ఆయిల్‌పామ్ పంట ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం

గోపాల్పేట్ ఆగస్టు 07 ( విజన్ ఆంధ్ర ) : శుక్రవారం గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన రైతు భాను జిల్లా ఉద్యాన శాఖ సహకారంతో తన పొలంలో ఆయిల్‌పామ్ మొక్కల నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో రైతు పొలంలో ఆయిల్ పామ్ మొక్కల నాటే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ ఆయిల్ పామ్ మొక్కను నాటి నీరు పోసి, రైతు భానుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రైతుతో మాట్లాడి ఎంత విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపడుతున్నారని, నీటి వసతి ఎలా ఉందని, సాగుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. మొత్తం నాలుగు ఎకరాల్లో ఆయిల్ పామ్ చేపడుతున్నట్లు, బోర్ నీటి ద్వారా సాగు చేయనున్నట్లు రైతు బదులిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం అవసరమని తెలిపారు. ఆయిల్‌పామ్ రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయాన్ని అందించే వాణిజ్య పంట అని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సాంకేతిక సూచనలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పిస్తూ ఆయిల్‌పామ్ సాగును మరింత ప్రోత్సహించాలని ఆదేశించారఈ సందర్భంగా రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లే రహదారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, బీవీజీ రామ్‌జీ పథకం కింద వ్యవసాయ రహదారి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని సంబంధిత ఎంపీడీవోను ఆదేశించారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని డీ వై ఎస్ ఓ సుధీర్ రెడ్డి, డీ హెచ్ ఎస్ ఓ విజయ్ భాస్కర్, తహసీల్దార్, ఎంపీడీఓ, సర్పంచ్ లోకా రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ త్యాగాలకు గౌరవం దక్కాలి

మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని టీజేఎస్ కు కేటాయించాలని

టీజేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు,నియోజకవర్గ ఇన్చార్జి మొసలి శ్యాం ప్రసాద్ రెడ్డి

నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) ఆగస్టు 07 శుక్రవారం : మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని మహాకూటమి (పొత్తు)లో భాగంగా తెలంగాణ జన సమితి(టీజేఎస్) పార్టీకి కేటాయించాలని టీజేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మొసలి శ్యాం ప్రసాద్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ జన సమితి పార్టీ కీలక పాత్ర పోషించిందని, ఉద్యమ లక్ష్యాల సాధన కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యమ స్ఫూర్తిని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యలు, నిరుద్యోగం, విద్య, పట్టభద్రుల హక్కుల కోసం టీజేఎస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తోందని తెలిపారు. తెలంగాణ



ఉద్యమానికి మేధోబలంగా నిలిచిన ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వానికి ప్రజల్లో విశేష ఆదరణ ఉందని పేర్కొన్నారు. అలాంటి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలంటే మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని తెలంగాణ జన సమితికి కేటాయించడం సముచిత నిర్ణయమని అభిప్రాయపడ్డారు. టీజేఎస్‌కు ఎమ్మెల్సీ స్థానం కేటాయించడం ద్వారా తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు గౌరవం లభించడమే కాకుండా, మహాకూటమి మరింత బలోపేతం అవుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి, ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమ శక్తులకు న్యాయం చేసేలా మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని తెలంగాణ జన సమితి పార్టీకి కేటాయించాలని రాష్ట్ర కమిటీ సభ్యులు, నాగర్ కర్నూల్ జన సమితి నియోజకవర్గ ఇన్చార్జి మొసలి శ్యాం ప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

మాగనూర్ , ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర) మండలం : ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ చేపట్టిన నాలుగు దశల పోరాటంలో భాగంగా మాగనూర్ మండలంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ మాగనూర్ పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టి తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ అమలు, ఆరు డీఏల విడుదల, పెండింగ్ బిల్లుల చెల్లింపు, హెల్త్ కార్డుల మంజూరు, సీపీఎస్ రద్దు తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జమ్మన్న, రాఘవేంద్రచారి, అనిత, రమ, మహేశ్వరి, విజయలక్ష్మి, వెంకట్‌రాములు, రాణి, ఆచారి, కళావతి, ఇందురాణి, గోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# శాకాంబరీ దేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు

పెబ్బేరు ఆగస్టు 7( విజన్ ఆంధ్ర) : ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి అమ్మవారిని శాకాంబరీ దేవి అలంకరణలో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పుష్పాలతో శాకాంబరీ దేవి రూపంలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. శాకాంబరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# రబీంద్రలో ఘనంగా బోనాల పండుగ

ముధోల్:07ఆగస్టు:విజన్ ఆంధ్ర : ముధోల్ మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పండుగ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, పోతరాజు, శివసత్తుల వేషధార ణలతో ఆకట్టుకున్నారు. బోనాలతో నెత్తిన ఎత్తుకొని పోతరాజు, శివస త్తులు తెలంగాణ బోనాల పండుగ పాటల పైన నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పెద్ద ఎత్తున బోనాల పండుగ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. బోనాలు తెలంగాణ ప్రజల భక్తి, సంస్కృతి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. దీంతో బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాలుగు కుటుంబాల ఇంటి నిర్మాణాలకు సిమెంట్ సహాయం"

**- సిమెంట్ లేక ఆగిన నిర్మాణాలకు ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహాయం...**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, కల్వకుర్తి, విజన్ ఆంధ్ర, ఆగస్టు 07: కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలో సిమెంట్ కొరతతో అసంపూర్తిగా ఉన్న నాలుగు ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గ్రామంలోని నిరుపేద కుటుంబాల పరిస్థితిని తెలుసుకున్నారు. సిమెంట్ లేక ఇంటి నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయని స్థానికులు విన్నవించడంతో ఆయన స్పందించారు.

శుక్రవారం తాండ్ర గ్రామానికి చెందిన ముద్రకొల్ల జంగయ్య, నేరటి మల్లయ్య పెంటయ్య, బొల్లె పరశరాములు, అల్లంపల్లి సంతోష్ ల ఇంటి నిర్మాణాల కోసం సిమెంట్ కిట్లను అందజేశారు. ఈ సహాయంతో వారి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేందుకు అవకాశం కలిగింది.

లబ్ధిదారులు ఉప్పల వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టాలను గుర్తించి ఆదుకున్నందుకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తాండ్ర గ్రామ మాజీ సర్పంచ్ సుశీల ఈశ్వరయ్య, మాజీ ఉపసర్పంచ్ మైబు యాదవ్, రామస్వామి, గోరటి కృష్ణయ్య, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు...



# ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**పిఆర్ సి ప్రకటించి,6 డిఏలను మంజూరు చేయాలి**

**-సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలి**

చారకొండ,ఆగస్టు 07(విజన్ ఆంధ్ర)రాష్ట్రంలోని ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోని యునైటెడ్ స్ట్రగుల్ ఫర్ పెండింగ్ టీచర్స్ ఇష్యూస్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం చారకొండ మండలంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డిటిఎఫ్ మండల అధ్యక్షుడు రాజు గౌడ్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై వెంటనే దృష్టి సారించాలని కోరారు. ఉపాధ్యాయులకు పిఆర్ సిని తక్షణమే ప్రకటించి అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే మంజూరు చేయాలని,సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం ఓపిఎస్ ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు రాం బిక్షం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించాలని,అలాగే 2003 డిఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు అంజయ్య మాట్లాడుతూ,ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులను ప్రభుత్వం వెంటనే కల్పించాలని,సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని వీడి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఐక్య ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమంలో చారకొండ మండలానికి చెందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలియజేశారు.

# వరి పంటలో పి.ఎస్.బి ,ట్రైకోడెర్మా విరిడే వినియోగంపై మరియు నీమాస్త్రం తయారీపై క్షేత్ర ప్రదర్శన

సంగారెడ్డి /వట్‌పల్లి ఆగస్టు 07(విజన్ ఆంధ్ర ) : వట్ పల్లి మండలం ఖాదిరాబాద్ గ్రామంలో వరి పంటలో పి.ఎస్.బి (ప్రష్ట్రశీంజూష్ట్రష్ వాశీశ్రీబఎఅశ్రీఐఓఅశ్ర డ్మీఞ్చీవతీఋ), ట్రైకోడెర్మా విరిడే వినియోగం మరియు నీమాస్త్రం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సైట్ పి.ఎస్.బి,ట్రైకోడెర్మా విరిడే యొక్క ప్రాముఖ్యత, పంటలో వాటి వినియోగం, విత్తన శుద్ధి మరియు నేలలో ఉపయోగించే విధానాల గురించి వివరించారు. ముఖ్యంగా ట్రైకోడెర్మా విరిడే ఒక జీవ నియంత్రణ కారకంగా పనిచేసి నేల ద్వారా సంక్రమించే వివిధ శిలీంధ్ర తెగుళ్లను నియంత్రించడంలో సహాయపడుతుందని, పి.ఎస్.బి నేలలోని అందుబాటులో లేని ఫాస్పరస్‌ను మొక్కలకు అందుబాటులోకి తీసుకురావడంలో సహాయపడుతుందని రైతులకు వివరించారు. అదేవిధంగా, నీమాస్త్రం తయారీ విధానం మరియు దాని ద్వారా పంటలో సూక్ష్మజీవుల కార్యకలాపాలను పెంపొందించుకోవడం, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ జీవ ఆధారిత పద్ధతులను పాటించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఈ క్షేత్ర ప్రదర్శనలో వట్‌పల్లి మండల వ్యవసాయ అధికారి శ్రీ శ్రీనివాస్ రెడ్డి గారు, వ్యవసాయ విస్తరణ అధికారి పరిమళ గారు మరియు కృషి సఖిస్ సురేఖ,అనురాధ,ఖాదిరాబాద్ గ్రామానికి చెందిన వరి సాగు చేస్తున్న రైతులు పాల్గొన్నారు.



# మంజీర నది ఖీూ పరిధిలో అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలి:

తహసీల్దార్‌కు గ్రామస్తుల వినతి పత్రం

చౌటకూర్, ఆగస్టు 07 (విజన్ ఆంధ్ర ): చౌటకూర్ మండలం శివ్వంపేట రెవెన్యూ పరిధిలోని మంజీర నది పక్కన ఉన్న ప్రభుత్వ నక్షబాట (రైతుల దారి) మరియు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్న అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు చౌటకూర్ తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, శివ్వంపేట రెవెన్యూ పరిధిలో గ్రామానికి ఎదురుగా ఉన్న బీరు పరిశ్రమ సమీపంలోని సర్వే నంబర్ 207లో ప్రభుత్వ నక్షబాట ఉంది. అయితే, ఆ భూమిలోని కొంత భాగాన్ని వ్యాపార అవసరాల కోసం నాలా కన్వర్షన్ చేసుకుని నిర్మాణ పనులు చేపడుతున్నారని వారు ఆరోపించారు. ఈ నిర్మాణాల వల్ల రైతులు వినియోగించే నక్షబాట దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో, ఈ స్థలం మంజీర నదికి ఆనుకుని ఉండటంతో ఇది ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందా అనే విషయాన్ని రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరారు. ఒకవేళ ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నట్లు తేలితే, వెంటనే వాటిని నిలిపివేసి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని



విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములు, రైతుల నక్షబాటలు మరియు మంజీర నది పరిరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అమలు చేయాలని గ్రామస్తులు కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ఫోటోలను ఆధారాలుగా తహసీల్దార్‌కు సమర్పించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు ఫిర్యాదును పరిశీలించి, నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చినట్లు సమాచారం.

# మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా బోనాల పండుగ:

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్ విజయేందర్ రెడ్డి లు పాల్గొన్నారు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢమాసంలో గ్రామ దేవతలకు భక్తి శ్రద్ధలతో జరుపుకునే రాష్ట్ర పండుగ అయిన బోనాల పండుగను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని భువనేశ్వరీ మాత ఆలయంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందరూ కలిసి పండుగను వేడుకగా జరుపుకున్నారు. పోతరాజులతో కలిసి అధికారులు, సిబ్బంది ఎంతో ఉత్సాహంగా నృత్యవిన్యాసాలతో పాటు డప్పు వాయిద్యాల మధ్య భోనాలను కార్యాలయం నుండి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మహిళా సిబ్బంది అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాలను అమ్మవారికి సమర్పించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దామయాపల్లి ఇంటి చోరీ కేసు ఛేదించిన పోలీసులు

**- 3 గురు అరెస్ట్, 25 తులాల వెండి రికవరీ..**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, కోయిలకొండ, విజన్ ఆంధ్ర,ఆగస్టు 07: మహబూబ్‌నగర్ జిల్లా దామయాపల్లి గ్రామంలో గత నెల 23వ తేదీన జరిగిన ఇంటి చోరీ కేసును కోయిలకొండ పోలీసులు సక్సెస్ ఫుల్ గా ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

దామయాపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ భర్త రవీందర్ గౌడ్ ఇంట్లో గత నెల 23వ తేదీ మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి ప్రవేశించారు. అనంతరం బీరువా తాళాన్ని కూడా పగలగొట్టి అందులో ఉన్న 15 వేల రూపాయల నగదు, 15 తులాల వెండి కాళ్ల పట్టీలు, 5 తులాల వెండి కాళ్ల పట్టీలు, 5 తులాల వెండి కుంకుమ భరిణెను దొంగిలించుకెళ్లారు. ఈ విషయంపై బాధితురాలు అదే రోజు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలు మరియు సమాచారంతో మణికొండ గ్రామానికి చెందిన ఈర్ల రాములు, నాగర్ కర్నూల్ కు చెందిన ఉంద్యాల రవీందర్ రెడ్డి, మరికల్ మండలం తీలేరు గ్రామానికి చెందిన చాకలి చంద్రయ్యలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. విచారణలో వారు నేరం అంగీకరించారని, వారి వద్ద నుండి 15 తులాల వెండి కాళ్ల పట్టీలు, 5 తులాల వెండి కాళ్ల పట్టీలు, 5 తులాల వెండి కుంకుమ భరిణెను పోలీసులు రికవరీ చేశారు. అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం మహబూబ్ నగర్ జె ఎఫ్ సి ఎం కోర్ట్ కు తరలించారు.

కేసును త్వరితగతిన ఛేదించి సొత్తును రికవరీ చేసిన పోలీసుల చర్యలపై జిల్లా ఎస్పీ జానకి, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# "పండ్లు, కూరగాయలతో మెరిసిన జోగులాంబ...

శాకాంబరీ రూపంలో భక్తులకు అనుగ్రహం"

- ఆషాఢ ఆఖరి శుక్రవారం సందర్భంగా అలంపూర్‌లో అద్భుత అలంకరణ..
- భక్తుల కోలాహలం...
- ఆషాఢ ఆఖరి శుక్రవారం అద్భుత దర్శనం...
- భక్తులతో కిక్కిరిసిన అలంపూర్...

ఉమ్మడి పాలమూరు జిల్లా, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 07: ఆషాఢ మాసం చివరి శుక్రవారం రోజున శక్తిపీఠం అలంపూర్ శ్రీ జోగులాంబ ఆలయం భక్తి శోభతో వెలిగిపోయింది. ఈ పవిత్ర దినాన అమ్మవారు సాక్షాత్తు శాకాంబరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తెల్లవారుజాము నుండే ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆ తర్వాత గర్భగుడిలో కొలువుదీరిన జోగులాంబను రకరకాల పండ్లు, ఆకుకూరలు, కూరగాయలతో అత్యంత మనోహరంగా అలంకరించారు. బంతి, చేమంతి పూలతో పాటు ఆపిల్, ద్రాక్ష, అరటి, బొప్పాయి, క్యాబేజీ, బీరకాయ, కాకరకాయలతో అమ్మవారి స్వరూపాన్ని తీర్చిద్దారు. చూడడానికి రెండు కళ్లు చాలవన్నట్లుగా ఉన్న ఆ దృశ్యం భక్తులను కట్టిపడేసింది.

"అన్నపూర్ణవు... శాకాంబరివు" అంటూ భక్తులు గోవింద నామాలతో మారుమోగించారు. శాకాంబరీ దేవి అంటే కరువు కాటకాలను తొలగించి ప్రజలకు ఆహారం, సుభిక్షతను ప్రసాదించే తల్లి. అందుకే ఈ అలంకరణ చూసిన భక్తులు "అమ్మా మా పంటలు పండించు, మా ఊరికి కరువు రాకుండా చూడు" అంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

ఆషాఢ మాసం చివరి శుక్రవారం కావడంతో సుదూర ప్రాంతాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు పసుపు కుంకుమలతో, కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తి పారవశ్యంతో నిండిపోయింది.

అమ్మవారి శాకాంబరీ అలంకరణను దర్శించిన ప్రతి ఒక్కరి మనసు పులకించిపోయింది. "ఇలాంటి దర్శనం జన్మలో మరువలేనిది" అంటూ భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆలయ కార్యనిర్వహణాధికారి దీప్తి రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ కూడా చేశారు.

"శాకాంబరీ దేవి ప్రత్యేకత"

శాకాంబరీ దేవి అంటే కూరగాయలు, పండ్లు, ఆకులను ఆహారంగా ఇచ్చే తల్లి. కరువు సమయంలో ప్రజలను కాపాడిన అవతారం. అందుకే ఆషాఢంలో ఈ అలంకరణకు విశేష ప్రాముఖ్యత ఉంది.

# ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి

అక్రమ నిర్మాణాలు కూల్చి.. ఆక్రమణదారులను అరెస్ట్ చేయాలి: సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

- జగద్గిరిగుట్ట సర్వే నంబర్ 348/1 ప్రభుత్వ భూములను వెంటనే పరిరక్షించాలని డిమాండ్
- జాంబవంతుని గుడి స్థలంలో మళ్లీ కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై ఆందోళన
- రాజీవ్ గృహకల్ప షాపింగ్ కాంప్లెక్స్ భూముల ఆక్రమణలపై విచారణ చేపట్టాలని డిమాండ్
- వేద పాఠశాల మార్గం, సోమయ్యనగర్ ప్రాంతాల్లో జరుగుతున్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని విజ్ఞప్తి

జగద్గిరిగుట్ట, ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర); జగద్గిరిగుట్టలో ప్రభుత్వ భూములపై పెరుగుతున్న ఆక్రమణలను అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ప్రభుత్వాన్ని కోరారు. జగద్గిరిగుట్ట సర్వే నంబర్ 348/1లోని ప్రభుత్వ భూముల ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మార్వో రాజేష్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ, జాంబవంతుని గుడి స్థలంలో గతంలో అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించినప్పటికీ, తిరిగి నిర్మాణాలు చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఆక్రమణలు జగద్గిరిగుట్టలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్నాయని, కేవలం కూల్చివేతలతో సరిపెట్టకుండా ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములను హైకోర్టు ఆదేశాల మేరకు వెంటనే సర్వే నిర్వహించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని కోరారు. లేదంటే ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని, భవిష్యత్ తరాలకు ప్రభుత్వ ఆస్తులు అందుబాటులో లేకుండా పోతాయని హెచ్చరించారు. రాజీవ్ గృహకల్పలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు కేటాయించిన భూములను పట్టాల పేరుతో ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత పట్టాల ప్రామాణికతను అధికారులు సమగ్రంగా పరిశీలించి, నకిలీ పట్టాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సోమయ్యనగర్‌లోని సలాసర్ పేరుతో ఉన్న భూమిని చిన్నచిన్న ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, అలాగే వేద పాఠశాలకు వెళ్లే మార్గం పక్కన కూడా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆక్రమణలను వెంటనే తొలగించి ప్రభుత్వ భూములను రక్షించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి రాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల కోశాధికారి సదానందం తదితరులు పాల్గొన్నారు.

# లడ్డూతో నమ్మకం గెలుచుకుని రూ. 3.45 కోట్ల మోసం

**- మైహోం భుజలో గణేష్ ఉత్సవాల లడ్డూను రూ. 51 లక్షలకు కొని పెట్టుబడుల పేరుతో వంచన...**



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్టు 07: గణేష్ ఉత్సవాల సందర్భంగా లడ్డూ వేలంలో రూ. 51 లక్షలు వెచ్చించి అందరి దృష్టిని ఆకర్షించిన ఓ వ్యక్తి, ఆ నమ్మకాన్నే ఆయుధంగా చేసుకుని కోట్ల రూపాయల మోసానికి పాల్పడిన ఘటన మైహోం భుజలో వెలుగులోకి వచ్చింది.

లడ్డూతో వచ్చిన క్రెడిబిలిటీ

గతేడాది సెప్టెంబర్‌లో మైహోం భుజ అపార్ట్‌మెంట్ కమ్యూనిటీలో జరిగిన గణేష్ ఉత్సవాల్లో కొండపల్లి గణేష్ అనే వ్యక్తి లడ్డూను రూ. 51 లక్షలకు దక్కించుకున్నాడు. ఆ లడ్డూ ప్రసాదాన్ని అపార్ట్‌మెంట్‌లోని అందరికీ పంచి "రిచ్‌మ్యాన్" అనే పేరు తెచ్చుకున్నాడు.

6 శాతం లాభం అంటూ ఉచ్చు

ఈ క్రెడిబిలిటీనే ఉపయోగించుకుని, బోయిన్‌పల్లికి చెందిన కిరణ్ ద్వారా అదే అపార్ట్‌మెంట్‌లో నివసించే సిల్వియా, ఆమె భర్త శ్రీనివాసరెడ్డికి గణేష్ పరిచయమయ్యాడు. "మా వ్యాపారంలో పెట్టుబడి పెడితే నెలకు 6 శాతం లాభం ఇస్తాం" అని నమ్మబలికాడు. లడ్డూ కోసం రూ. 51 లక్షలు ఖర్చు చేసిన వ్యక్తి కాబట్టి ఆర్థికంగా బలంగా ఉంటాడని నమ్మిన ఆ దంపతులు తొలుత రూ. 31 లక్షలు పెట్టుబడిగా ఇచ్చారు. లాభాలు లేవు, ఆ తర్వాత మాయం కొన్ని రోజులకు లాభాల గురించి అడిగితే వాయిదాలు చెప్పడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఫోన్లు సైతం స్విచ్ ఆఫ్ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గణేష్, కిరణ్ ఇద్దరూ మైహోం భుజలోని తమ ఫ్లాట్లను ఖాళీ చేసి పరారయ్యారు.

మొత్తం రూ. 3.45 కోట్ల వంచన

బాధితులు విచారణ చేయగా, సిల్వియా దంపతులు మాత్రమే కాదు, మరో నలుగురి దగ్గర కూడా ఇదే విధంగా డబ్బు వసూలు చేసినట్లు తేలింది. మొత్తం కలిపి సుమారు రూ. 3.45 కోట్లు వసూలు చేశారు. బాధితుల్లో జీవితకాల కష్టార్జితాన్ని కోల్పోయిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు.

ప్రసాదం పేరుతో నమ్మకాన్ని గెలుచుకుని, పెట్టుబడుల పేరుతో మోసం చేసిన ఈ ఘటనపై బాధితులు సైబరాబాద్ ఈఓడబ్ల్యూకి లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కల్లేడి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక...

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ నియోజకవర్గ లో నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాటిపల్లి నాగేష్ రెడ్డి గారి ఆదేశాల మేరకు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి గారి సూచనలతో ఆలూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేగం ప్రమోద్ గారి ఆధ్వర్యంలో కల్లేడి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొంధ్ర శివకృష్ణ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నా మనీ తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు...



# రైతు సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయం

**- రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి**
**- తుర్కయంజాల్ పీఏసీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య**
**- రైతులకు రూ.1.83 కోట్ల రుణాలు మంజూరు**

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర ) : రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని పీఏసీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. రైతు సంక్షేమమే రైతు సేవా సహకార సంఘం యొక్క ప్రధాన ధ్యేయమని అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం యొక్క పాలకవర్గ సమావేశం సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన సంఘం ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఇట్టి సమావేశంలో 8 మందిని నూతన సభ్యులుగా చేర్చుకున్నారు. 15 మంది రైతులకు రూ.1 కోటి 83 లక్షల రూపాయలు అప్పులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం, త్రైమాసిక జమ ఖర్చులు ఆమోదించారు. అనంతరం సంఘ సభ్యుల సంక్షేమం కొరకు ఇతర అభివృధి కార్యక్రమాలు చేయుటకు ఆమోదించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ... సంఘం అభివృద్ధిలో రైతుల సహకారం ఎంతో ఉన్నదని అన్నారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. రైతు సంక్షేమమే సంఘం యొక్క ప్రధాన ధ్యేయమని అన్నారు. సహకార సంఘాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. రైతుల ఆర్థికాభ్యిద్దే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి ముందుకెళ్తున్నట్లు చెప్పారు. రైతులు సహకార సంఘం అభివృద్ధికి మరింత సహకారం అందించాలని కోరారు. సమావేశంలో పీఏసీ సభ్యులు వంగేటి లక్ష్మారెడ్డి, జక్క కృష్ణారెడ్డి, కొత్త రాంరెడ్డి, కొంద్రు స్వప్న శ్రీనివాస్, చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవ రెడ్డి, నర్సింగ్ రావు, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, సామ సత్యనారాయణ రెడ్డి, సీఈవో వై.రాందాస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### నీట్ శిక్షణ పొందుతున్న హైదరాబాద్ యువతి బలవన్మరణం:

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): కృష్ణా జిల్లా కానూరులోని శ్రీ భారతి ఇన్‌స్టిట్యూట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ సెంటర్‌లో మూడు వారాల కిందట నీట్ శిక్షణ కోసం చేరిన బేగంపేటకు చెందిన కంతేటి వైష్ణవి(19), ఇన్‌స్టిట్యూట్ హాస్టల్‌లోనే ఉంటూ, ఇటీవల ఇంటికి వెళ్లి రెండ్రోజుల తర్వాత తిరిగి వచ్చి, ఇంత దూరంలో ఉంటూ చదవలేననీ తనను ఇంటికి తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు ఫోన్ చేసిన వైష్ణవి. వారు ఆమెకు నచ్చజెప్పగా, ఈనెల 4న తనకు ఆరోగ్యం బాగోలేదని కాలేజీకి వెళ్లకుండా హాస్టల్ రూంలో ఫ్యానుకు ఉరేసుకొని వైష్ణవి బలవన్మరణం పొందింది.

రాత్రి 9 గంటలకు యువతితో పాటు ఉండే ఇద్దరు విద్యార్థినులు తెలపడంతో, కాలేజీ సిబ్బంది రూం తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే వైష్ణవి మృతి చెందారు.

# విద్యార్థులు ఉద్యోగ, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాధిక**
**ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా**

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 7 (విజన్ ఆంధ్ర ) : విద్యార్థులు ఉద్యోగ, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలను కల్పించడం, వారి నైపుణ్యాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాబ్ మేళాకు వివిధ సంస్థల ప్రతినిధులు హాజరై విద్యార్థులకు ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కళాశాలలోని వివిధ కోర్సులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాధిక మాట్లాడుతూ... విద్యార్థులు విద్యార్హతలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ మరియు ఉద్యోగ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన కెరీర్ అవకాశాలను అందించేందుకు కళాశాల నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ డా.కె.మాధవి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇటువంటి జాబ్ మేళాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు పరిశ్రమల అవసరాలు, ఉద్యోగ అవకాశాలు మరియు ఎంపిక ప్రక్రియపై అవగాహన కల్పించడంలో ప్లేస్‌మెంట్ సెల్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. జాబ్ మేళాను విజయవంతం చేయడంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాధిక, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ డా.కె.మాధవి, డా.రాకేష్ భవాని, డా.ధన్ రాజ్, డా.నరసింహారావు, డా.నీలిమ మరియు కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సహకరించారు. విద్యార్థుల భవిష్యత్ ఉద్యోగ అవకాశాల కోసం ఇలాంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించాలని కళాశాల సిబ్బంది ఆకాంక్షించారు.

# హాస్టళ్ళు, రెసిడెన్షియల్ స్కూల్స్‌ను విధిగా సందర్శించాలి

## - మండల ప్రత్యేక అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం

నిజామాబాద్, ఆగస్టు 07 :(విజన్ ఆంధ్ర )ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ ను క్రమం తప్పకుండా సందర్శించాలని మండల ప్రత్యేక అధికారులను కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యా సంస్థల నిర్వహణ గణనీయంగా మెరుగుపడేలా, నాణ్యమైన విద్యా బోధన జరిగేలా మండల స్పెషల్ ఆఫీసర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మండల స్థాయి అధికారులను సమన్వయము చేసుకుని ప్రతి వారం -- ప్రతి విద్యా సంస్థను తప్పనిసరిగా సందర్శించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాలతో పాటు, జిల్లాలో గల అన్ని కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, మహాత్మా జ్యోతిబాపూలే, బీ.సీ, ఎస్.సీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థలను విధిగా సందర్శించి నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ కూడా ఫుడ్ పాయిజనింగ్, పాముకాటు, తేలు కాటు వంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యా సంస్థలను సందర్శించిన సందర్భంగా గమనించిన అంశాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్ ద్వారా తమకు నివేదించాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడైనా డ్రైనేజీ సమస్య నెలకొని ఉంటే తక్షణమే పరిష్కరించాలని, సానిటేషన్ సమస్య నెలకొనకుండా చొరవ చూపాలన్నారు. శిథిలావస్థకు చేరిన పురాతన భవనాలు ఉంటే, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వెంటనే వాటిని తొలగింపజేయాలని ఆదేశించారు. విద్యార్థిని, విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని మెరుగుపర్చేందుకు వీలుగా చేపట్టిన ఎఫ్.ఎల్.ఎన్ విధానం ప్రతి విద్యా సంస్థలోనూ పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. కాగా, జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందించేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, చారిత్రక ప్రదేశాల సమాచారాన్ని క్షేత్రస్థాయి అధికారులు పక్కాగా అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**- సాదుల పవన్ కుమార్ ఏఎంసీ వైస్ చైర్మన్**

నంగునూర్ మండలం ఆగస్టు 07 విజన్ ఆంధ్ర : భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత రంగం పోషించిన పాత్ర చిరస్మరణీయమని, స్వదేశీ ఉద్యమానికి చేనేత ఒక బలమైన ఆయుధంగా నిలిచిందని ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నంగునూర్ మండల కేంద్రంలో గ్రామ పద్మశాలి సమాజం, మండల చేనేత సహకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నంగునూర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్దకు చేరుకున్న నాయకులు, చేనేత కార్మికులు, పద్మశాలి సంఘం సభ్యులు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ స్వదేశీ ఉద్యమంలో చేనేతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. రాట్నంపై స్వయంగా నూలు వడుకుతూ ఖాదీ వినియోగాన్ని ప్రజల్లో ప్రోత్సహించారని తెలిపారు. చేనేతకు ఉన్న చారిత్రక, సామాజిక ప్రాధాన్యతను గుర్తించి ప్రతి సంవత్సరం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు.

చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తున్న చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. నేతన్నల జీవనోపాధి మెరుగుపడేలా పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పవన్ కుమార్ పేర్కొన్నారు. నేతన్నల ఆర్థికాభివృద్ధి, ఉపాధి భద్రత, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాల కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం మండల చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దాసరి రవికుమార్ మాట్లాడుతూ, చేనేత రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేతన్న జీవిస్తేనే చేనేత పరిశ్రమ మనుగడ సాగుతుందని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా నేతన్నలకు చేయూతనివ్వాలని ప్రజలను కోరారు.

నంగునూర్ గ్రామ పద్మశాలి సమాజం అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ, చేనేత రంగాన్ని రాజకీయాలకు అతీతంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేతన్నలకు భరోసా కల్పిస్తూ చేనేతకు మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలని ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా కృషి చేయాలని కోరారు. "నేతన్నను కాపాడుకుందాం... చేనేతను బతికించుకుందాం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రచ్చ సిద్దు, దాసరి రాజు, దాసరి రామలింగం, దాసరి అంజనేయులు, పోతన వినోద్, ఆరగొండ శశికుమార్, దీకొండ భాను, దాసరి శ్రీనివాస్, కారంపూరి శ్రీనివాస్, సాదుల రాజు, సాదుల నరేందర్, బింగి రవిందర్, బొజ్జ మహేశ్, వేముల రాజమౌళి, గాజర్ల సిద్దు, అనందాసు విష్ణుమూర్తి, సంగు రమేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.